ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
ఆదివారం 23 మార్చి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980
నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.95	140	170
నల్లగొండ	రూ.100	145	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 । కనిష్ఠం 19.0

వాట్సప్‌లో ప్రశ్నపత్రం
ఎవరికోసం..?

- పూర్తిస్థాయి విచారణ చేపట్టిన అధికారులు
- ఇన్విజిలేటర్ సస్పెన్షన్
- విధుల నుంచి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి తొలగింపు
- పూర్తిస్థాయి విచారణకు ఆదేశించిన కలెక్టర్ ఇలాత్రిపాఠి




నల్లగొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పదో తరగతి తెలుగు-1 ప్రశ్నపత్రం వాట్సప్ గ్రూపుల్లో ప్రత్యక్షమైన ఘటనపై ప్రభుత్వం విచారణ నిర్వహిస్తోంది. ప్రశ్నపత్రం నకిరేకల్ ఎస్సీ గురుకుల విద్యాలయం పరీక్షా కేంద్రం నుంచే లీక్ అయిందని నిర్ధారణకు వచ్చిన విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రశ్నాపత్రం ఫొటో తీశారని భావించిన విద్యార్థినిని డీబార్ చేశారు. ఆ పరీక్ష హాల్ ఇన్విజిలేటర్ సుధారాణిని సస్పెండ్ చేయగా, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ గోపాల్, డిపార్ట్‌మెంటల్ అధికారి రామ్మోహన్‌రెడ్డిని విధుల నుంచి తొలగించారు. మొత్తం ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టారు. నకిరేకల్ సర్కిల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తుండగా, విద్య, రెవెన్యూ, పోలీసుశాఖల ద్వారా సంయుక్త విచారణ కొనసాగుతోంది. వాట్సప్‌లో ప్రశ్నాపత్రం వెలువడటాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం ఒకవైపు వదంతులు వ్యాప్తి చేయవద్దని హెచ్చరిస్తూ, మరోవైపు ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఆదేశించగా, కలెక్టర్ ఇలాత్రిపాఠి విచారణకు ఆదేశించారు. మరోవైపు పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఆమె ఎస్పీ శరత్‌చంద్రపవార్‌తో కలిసి పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. విద్య, రెవెన్యూ, పోలీస్ అధికారుల నుంచి ప్రాథమిక సమాచారం సేకరించారు.

ఎవరి కోసం, ఎవరు చేశారనే కోణంలో దర్యాప్తు..

వాట్సప్‌లో ప్రశ్నపత్రం వెలుగుచూసిన ఘటనలో కీలకమైన అంశాలపై పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆరా...

- మిగతా 7వ పేజీలో...



వెనుకబడిన విద్యార్థుల కోసం
ఏఐతో బోధన

- తెలుగు, గణిత అభ్యాసాలపై సులువైన పద్ధతిలో బోధన
- ఉమ్మడి జిల్లాలో పలు పాఠశాలల్లో అమలు

విద్యార్థుల్లో పలువురు మౌలిక భాష, సంఖ్యాజ్ఞానం అభ్యాసనతో పాటు గణితంలో చతుర్విధ ప్రక్రియల్లోనూ ఆశించిన స్థాయి సామర్థ్యాలు కనిపించడం లేదు. దీంతో విద్యాభ్యాసంలో వెనకబడుతున్నారు. వీరికోసం విద్యాశాఖ పలు రకాల కార్యక్రమాలు అమలు చేస్తున్నా సత్ఫలితాలు రావడం లేదు. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధ సాయంతో విద్యార్థుల్లో మెరుగైన సామర్థ్యాల సాధన కోసం ప్రత్యేక చర్య లు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల్లో విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి విడతల వారీగా ఏఐ ద్వారా పాఠాలు అందిస్తున్నారు. వారికి తెలుగు, గణిత అభ్యాసాలపై తరగతులు ఏర్పాటుచేశారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా విద్యార్థులను ఆకట్టుకునేలా ఏఐ బోధన చేస్తున్నారు.

ఐదుగురితో బ్యాచ్, 20 నిమిషాల క్లాస్

పాఠశాలల్లో అందుబాటులో ఉన్న కంప్యూటర్లను బట్టి ఒక్కో కంప్యూటర్‌కు ఒక విద్యార్థిని ఎంపిక చేశారు. సూర్యాపేట జిల్లాలో ఐదుగురిని ఒక బ్యాచ్‌గా ఏర్పాటు చేసి ఒక్కో బ్యాచ్‌కు తెలుగు వాచకం, గణిత అభ్యాసాలపై 20 నిమిషాల వ్యవధిలో ఏఐ పాఠాలు బోధిస్తున్నారు. పాఠాలను సంబంధిత విద్యార్థి అర్థం చేసుకున్నాడా లేడా అనేది ఏఐ గుర్తించి అర్థం కాకపోతే అతడికి అర్థమయ్యే రీతిలో సరళమైన పద్ధతిలో బోధిస్తుంది. అర్థమైతే మరికొంత మెరుగైన పద్ధతిలో బోధిస్తుంది.

- మిగతా 7వ పేజీలో...


కంప్యూటర్ల ద్వారా ఏఐ పాఠాలు వింటున్న విద్యార్థులు

యాదాద్రి భువనగిరి జిల్లాలో..

మొత్తం ఏడు మండలాల్లోని 9 పాఠశాలల్లో ఏఐ పాఠాలు బోధిస్తున్నారు. చౌటుప్పల్ మండలంలో జైకేసారం, దేవలమ్మనాగారం, భువనగిరి మండలంలో తుక్కాపూర్, మోటకొండూరు మండలంలో ముత్తిరెడ్డిగూడెం, ఆలేరు మండలంలో కొల్లూరు,రామన్నపేట మండలంలో ఇంద్రపాలనగరం, యాదగిరిగుట్టమండలంలో పెద్దకందుకూరు, చొల్లేరు, బీబీనగర్ మండలంలో జమీల్‌పేట గ్రామాల్లోని పాఠశాలల్లో అమలు చేస్తున్నారు.

సూర్యాపేట జిల్లాలో..

గరిడేపల్లి మండలంలోని వెల్దండ, రాయినిగూడెం,గానుగబండ,సూర్యాపేట మండలంలో ఇమాంపేట, చివ్వెంల మండలంలో వట్టిఖమ్మంపహాడ్, హుజూర్‌నగర్ మండలంలో బూరుగడ్డ, మోతె మండంలో ఉంద్రుగొండ, నేరేడుచర్ల మండంలో చింతకుంట్ల, మఠంపల్లి మండలంలో వరదాపురం, చింతలపాలెం మండలంలో తమ్మవరం, నడిగూడెం మండలంలో వల్లాపురం, మద్దిరాల మండలంలో రెడ్డిగూడెం, తిరుమలగిరి మండలంలో తొండ గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఏఐ పాఠాలు బోధిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతానికి 130మంది విద్యార్థులకు ఏఐ పాఠాలు బోధిస్తున్నారు.

నల్లగొండ జిల్లాలో...

జిల్లాలోని 10 మండలాల్లో 14 పాఠశాలల్లో ఏఐ పాఠాలు అందిస్తున్నారు. అనుముల మండలంలో హాలియా, కొత్తపల్లి, చిట్యాల మండలంలో నేరెడ, దామరచర్ల మండలంలో కల్లేపల్లి, దేవరకొండ మండలంలో ఇద్దంపల్లి, కేతేపల్లి మండలంలో తుంగతుర్తి, కొప్పోలు, మిర్యాలగూడ మండలంలో అన్నారం, మునుగోడు మండలంలో కొరటికల్, నల్లగొండ మండలంలో కంచనపల్లి, శాలిగౌరారం మండలంలో భైరవునిబండ, వేములపల్లి మండలంలో ఆమనగల్ పాఠశాలల్లో ఏఐ తరగతులు నిర్వహిస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:34 (ఆదివారం సాయంత్రం)
సహర్: 4:55 (సోమవారం ఉదయం)

ఫ్లైఓవర్‌లను నిర్మించి ప్రమాదాలు నివారించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి




పాదయాత్రను ప్రారంభిస్తున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై ఫ్లైఓవర్ వంతెనలను నిర్మించి ప్రమాదాలు నివారించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం సీపీఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టాలని కోరుతూ రామచంద్రగూడెం వైజంక్షన్ నుంచి బైపాస్ మీదుగా నందిపాడు క్రాస్‌రోడ్, టాకారోడ్డు, రాజీవ్‌చౌక్ మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి డివిజనల్ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణం విస్తరించి బైపాస్‌కు అవతలివైపు జనావాసాలు పెరిగాయన్నారు. నిత్యం వందలాది మంది ప్రజలు విద్య, వ్యాపారం, అనేక రకాల పనులపై బైపాస్‌పై క్రాస్‌రోడ్ల వద్ద అటుఇటు రాకపోకలు చేస్తుంటారన్నారు. వేగంగా వెళ్లే వాహనాలతో తరుచూ ప్రమాదాలు జరుగుతూ, ప్రాణనష్టం సంభవిస్తుందన్నారు. బైపాస్‌పై వైజంక్షన్, నందిపాడు, చింతపల్లి, ఈదులగూడ క్రాసింగ్‌ల వద్ద ఫ్లైఓవర్ వంతెనలు నిర్మించాలన్నారు. బైపాస్‌పై 4 అండర్‌పాస్‌లను నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, సంబంధిత మంత్రి గత ఆరు నెలల క్రితం భూమి పూజ చేశారని తెలిపారు. నేటివరకు అండర్‌పాస్‌ల నిర్మాణపనులు ప్రారంభానికి నోచలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరుచేసి అండర్‌పాస్‌లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీశ్ చంద్ర, సత్యనారాయణరావు, గాదె పద్మ, రవినాయక్, మల్లుగౌతంరెడ్డి, మంగారెడ్డి, శశిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, రెమిడాల పరుశరాములు, వరలక్ష్మి, చౌగాని సీతారాములు, అయూబ్, అంజద్, అరుణ పాల్గొన్నారు.

బరిలో దించేందుకు సిద్ధం కావాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి



మహాసభలో మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

దేవరకొండ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ నుంచి బరిలో నిలిచేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంకావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పల్లా నర్సింహారెడ్డి కోరారు. శనివారం దేవరకొండ మండలం పడ్మట్‌పల్లిలో జరిగిన గ్రామశాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా అత్యధిక స్థానాల్లో పోటీచేసి సత్తాచాటాలన్నారు. ప్రజా సమస్యలపై సీపీఐ ప్రజలపక్షాన నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఎస్ఎల్‌బీసీ, డిండి, పెండ్లిపాకల ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కిన్నెర యాదయ్య, మండల సీపీఐ కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, వలమాల ఆంజనేయులు, పల్లా రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయడమే ధ్యేయం

- ఐక్యత చాటడమే నా పని
- టీపీసీసీ మాజీ నేత కుందూరు జానారెడ్డి
- ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు ఘనస్వాగతం

మిర్యాలగూడ టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే ధ్యేయమని టీపీసీసీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. మిర్యాలగూడలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ స్వాగత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి జిల్లా అందులో మిర్యాలగూడ నియోజకవర్గం రాష్ట్రానికిశక్తి లాంటిదన్నారు. సామాన్య కార్యకర్తగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన శంకర్‌నాయక్ ఎమ్మెల్సీగా ఎన్నికవ్వడం సంతోషకరమన్నారు. ఒక గిరిజన బిడ్డను ఎమ్మెల్సీగా చేయడం ఇదే ప్రథమమన్నారు.ఇక బడా, చోటా నేతలను, నాయకులు, కార్యకర్తలను ఐక్యతగా ఉంచుతూ పార్టీని బలోపేతం చేయడమే తన పని అన్నారు.


జానారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎంపీ రఘువీర్‌రెడ్డిలకు పూలమాల వేస్తున్న నాయకులు

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం: ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

సామాజిక న్యాయం ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. తొలిసారిగా నియోజకవర్గానికి వచ్చిన శంకర్‌నాయక్‌కు కార్యకర్తలు స్వాగతం పలికారు. గిరిజన నృత్యాలు, పూలు, గజమాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుందూరు జానారెడ్డి తండ్రి సమానులని అన్నారు. ఎమ్మెల్సీగా తనను ఎంపిక చేసిన పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేస్తానని, అందరినీ సమన్వయపరుస్తూ నియోజకవర్గం, జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

కష్టానికి తగిన ఫలితముంటుంది : ఎంపీ

కష్టానికి తగిన ఫలితం ఎప్పటికైనా ఉంటుందని ఎంపీ రఘువీర్‌రెడ్డి అన్నారు. చిన్నతనం నుంచే పార్టీ, ప్రజల కోసం పనిచేసిన శంకర్‌నాయక్‌ను ఎమ్మెల్సీగా చేయడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, నూకల వేణుగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ, తలకొప్పుల సైదులు, పొదిల శ్రీను, స్కైలాబ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు నీటి ఎద్దడి రాకుండా చేద్దాం

జిల్లా భూగర్భ జల శాఖాధికారి రేవతి


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా భూగర్భజలశాఖాధికారి రేవతి

నార్కట్‌పల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నీటిని ఒడిసిపట్టి భూగర్భంలోకి ఇంకింపజేయడం ద్వారా భావితరాలకు నీటి ఎద్దడి లేకుండా చేద్దామని జిల్లా భూగర్భజల శాఖ అధికారి రేవతి అన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని నెమ్మాని రైతువేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. భూగర్భజలాల సంరక్షణ, వర్షపు నీటిని ఏవిధంగా భూమిలోకి ఇంకింపజేయాలో రైతులకు వివరించారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి అనంతరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఆరుతడి పంటలు, బిందు, తుంపరసేద్యంతో జరిగే లాభాల గురించి అవగాహన కల్పించారు. సదస్సులో మండల ప్రత్యేకాధికారి చరిత, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో కత్తురోజు ఉమేశ్ చారి, ఏవో కే.గౌతమ్, మండల ఉద్యానవనాధికారి శ్వేత, ఆర్.మానస, అసిస్టెంట్ హైడ్రాజియాలజిస్టులు కే.రజని, ఎన్.కుమార్, జియోఫిజిస్టు లక్ష్మయ్య, సూపరింటెండెంట్ రాకేశ్‌రెడ్డి, ఆదర్శ రైతులు కే.జనార్ధన్‌రెడ్డి, కే.సత్తిరెడ్డి, జావేద్, నర్సింహ, మహేశ్, యాదగిరి పాల్గొన్నారు.

మిస్ వరల్డ్ పోటీదారులకు
ఏర్పాట్లు చేయాలి

- పర్యాటకశాఖ ఎండీ ప్రకాష్ రెడ్డి
- నాగార్జునసాగర్‌లో కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో సమీక్ష


బుద్ధవనంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న పర్యాటక శాఖ ఎండీ ప్రకాష్‌రెడ్డి

7

క్షుణ్ణంగా తనిఖీ చేయాలి: కలెక్టర్


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి , ఎస్పీ శరత్‌చంద్ర పవార్

హాలియా, మార్చి22(ఆంధ్రజ్యోతి): విద్యార్థును క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం హాలియాలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ శరత్‌చంద్రపవార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. వారివెంట సీఐ జనార్ధన్ గౌడ్, మండల విద్యాధికారి గుండా కృష్ణమూర్తి, సీఎస్ చిన్న నారాయణరెడ్డి, డీవో గవ్వ హిమవంతరెడ్డి, ఎస్ఐ సతీష్‌రెడ్డి ఉన్నారు.

డెడ్ స్టోరేజీకి బీ.వెల్లెంల రిజర్వాయర్ సామర్థ్యం

- 296 నుంచి 290 మీటర్లకు చేరిన నీటి మట్టం

నార్కట్‌పల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేసవి కారణంగా ఎగువ నుంచి నీటి విడుదల లేకపోవడంతో నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టు రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరింది. దీంతో రెండు రోజులుగా రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల నుంచి నీటి విడుదల నిలిచిపోయింది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం (0.302 టీఎంసీలు) 296 మీటర్లు కాగా ప్రస్తుతం 290మీటర్లకు చేరుకుంది. దీంతో రిజర్వాయర్ నుంచి మొన్నటి వరకు కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటి విడుదల చేయగా పరిసర గ్రామాల్లోని చెర్వులు నిండాయి. ప్రస్తుతం నీటినిల్వలు తగ్గడంతో సరఫరా కూడా నిలిచిపోయింది.

ఎండదెబ్బ కాకుండా ఉంటాం

- మండుటెండలో ట్రాఫిక్ పోలీసుల తిప్పలు
- విధుల్లో 50 మంది అధికారులు, సిబ్బంది
- సమ్మర్ కిట్స్, శీతల పానియాలతో ఉపశమనం

6

వయసుకు లేదు విశ్రాంతి

▸ క్రీడల్లో రాణిస్తున్న విశ్రాంత ఉద్యోగులు పిచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డి

కొంతమంది కుర్రవాళ్లు పుట్టుకతో వృద్ధులు' అంటూ కవి శ్రీశ్రీ సోమరిపోతుల గురించి కవితాగ్రహం వ్యక్తం చేస్తాడు. అలాంటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ సీనియర్ సిటిజన్లు. విశ్రాంతి అనేది ఉద్యోగానికే కానీ మా కు కాదంటూ నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన విశ్రాంత ఉద్యోగులు పిచ్చిరెడ్డి, వెంకటరెడ్డిలు నవ యువకుల్లా నడక సాగిస్తూనే, క్రీడా పోటీల్లో విజేతలుగా నిలుస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఇటీవల సూర్యాపేట జిల్లా కోదాడలో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఇందులో మిర్యాలగూడకు చెందిన ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బంధుమిత్రులకు సేవలందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనే విశ్రాంత ఉద్యోగులు రాష్ట్రస్థాయి బహుమతులు సాధించి నేటితరం యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

వాకింగ్‌లో పిచ్చిరెడ్డి, చెస్‌లో వెంకటరెడ్డి

మిర్యాలగూడ పట్టణానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు దండ పిచ్చిరెడ్డి వాకింగ్‌రేస్ పోటీలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు. 2008లో రిటైరైనప్పటికీ యువకుడిలా వేగంగా నడవడంలో దిట్ట. అదేవిధంగా విశ్రాంత ఉపాధ్యాయుడు సిరిగిరి వెంకటరెడ్డి చెస్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించారు. 2020లో పదవీ విరమణ పొందిన వెంకటరెడ్డి వాకింగ్‌తో పాటు చదరంగక్రీడను సాధన చేస్తుంటాడు. చెస్‌లో చిన్నారులకు మెళకువలు నేర్పిస్తూ సరదాగా ఉంటే వెంకటరెడ్డి విశ్రాంతఉద్యోగులసంఘం కోశాధికారిగా సేవలందిస్తున్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



నేను నిత్యం వాకింగ్ చేస్తా. గంట సేపు వాకింగ్ చేయనిదే రోజు గడవదు. నేటి యువత పట్టుమని పదడుగులు వేయలేకుండా ఉంటున్నారు.. అది సరికాదు. బద్దకం శత్రువు లాంటిది. అది వీడి నిత్యం వ్యాయామం చేయాలి. సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయకుండా శరీరానికి శ్రమ కల్పించాలి. క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ ఏదైనా కొద్దోగొప్పో ఆసక్తి ఉన్న క్రీడను ఎంచుకుని సాధన చేయాలి. ఆరోగ్యంగా ఉంటనే ఏదైనా సాధించగలం.

- దండ పిచ్చిరెడ్డి

నేటి యువత నిర్లక్ష్యం వీడాలి



వయసనేది మనసుతో ముడిపడిఉంటుంది. యువత నిర్లక్ష్యం వీడి మైదానాలకు తరలాలి. ఆరోగ్య సమాజ నిర్మాణానికై ప్రభుత్వాలు ఓపెన్ జిమ్‌లను ఏర్పాటుచేశాయి. వ్యాయామం చేయడం ద్వారా బరువు తగ్గొచ్చు. కసరత్తులు చేయడం ద్వారా ఫిట్‌గా ఉండొచ్చు. యోగా, ధ్యాన సాధన ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

- సిరిగిరి వెంకటరెడ్డి (రిటైర్డ్ టీచర్)

ఎండల్ కాకుండా ఉంటాం



గడియారం సెంటర్‌లో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్

వేసవిలో ఎండ తీవ్రతకు రోడ్డు మీద పట్టుమని 10 నిమిషాలు నిలువలేని పరిస్థితి. ఒకవేళ బయటకు వెళ్లివచ్చినా వడగాడ్పుకు, ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు, ఏసీలను ఆశ్రయించి ఉపశమనం పొందుతుంటారు. అయితే ట్రాఫిక్ పోలీసుల పరిస్థితి మాత్రం దారుణంగా ఉంటుంది. మండుటెండలో విధులు నిర్వహిస్తూ అల్లాడిపోతుంటారు.అయినా విధులను మాత్రం నిర్లక్ష్యం చేయకుండా డ్యూటీ ఫస్ట్ అంటూ పనిచేస్తుంటారు. ప్రజారక్షణే ధ్యేయంగా విధి నిర్వహణ చేస్తున్న ట్రాఫిక్ పోలీసుల ఉద్యోగ బాధ్యతలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ క్రైం)

▸ మండుటెండలను లెక్కచేయని ట్రాఫిక్ పోలీసులు
▸ విధుల్లో 50 మంది అధికారులు, సిబ్బంది
▸ సమ్మర్ కిట్స్, శీతల పానియాలతో ఉపశమనం

వేసవి తీవ్రత మార్చిలోనే పెరుగుతూనే ఉంది. ఉదయం 11గంటలు దాటితే నల్లగొండలో ఎండ వేడిమితో పాటు ఉక్కపోత ఎక్కువవుతోంది. జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇప్పటికే 37.0 డిగ్రీలు దాటాయి. దీంతో దూర ప్రాంతాలు, పట్టణాల్లో ఉండే ప్రజలు మధ్యాహ్నం లోపే బయటి పనులు ముగించుకుని ఇంటికి వెళ్లి సేదతీరుతున్నారు. కానీ ట్రాఫిక్ పోలీసు సిబ్బందిమాత్రం రోడ్డుపైనే ఎనిమిది గంటల పాటు నిల్చుని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న ఏప్రిల్, మే మాసాల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. పెరుగుతున్న ఎండలకు అనుగుణంగా ట్రాఫిక్ సిబ్బంది కూడా ముందస్తు జాగ్రత్తలతో విధులు నిర్వహించేందుకు సన్నద్ధం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

రెండు షిఫ్టులలో విధులు..

జిల్లా కేంద్రంలో మొత్తం 18 ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్స్ ఉండగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ద్వారా సిబ్బంది రెండు షిఫ్టులలో విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ ఒక షిఫ్ట్, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ మరోషిఫ్ట్ ఉంటుంది. ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు వీచే ప్రమాదం ఉండడంతో విధుల నిర్వహణ దుర్భరంగా ఉంటుంది. విధుల సమయాల్లో కొంత వెలుసుబాటు కల్పిస్తే ట్రాఫిక్ సిబ్బంది ఆరోగ్యాలను కూడా కాపాడిన వారవుతారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

విధుల్లో సుమారు 50 మంది అధికారులు, సిబ్బంది

నల్లగొండ పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సుమారు 50మంది అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు.అందులో ఒక సీఐ,ఇద్దరు ఎస్‌ఐలు, ఇద్దరు ఏఎస్‌ఐలతో పాటుహెడ్‌కానిస్టేబుళ్లు, పీసీలు ఉన్నారు. వీరికి అదనంగా జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య లేకుండా ఎప్పటికప్పుడు చేసే ఆలోచనతో నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఏఆర్ విభాగం నుంచి కూడా 16 మంది సిబ్బందిని కేటాయించారు. వీరంతా షిఫ్టుల వారీగా ఎప్పటికప్పుడు విధుల్లో నిమగ్నమై తమకు కేటాయించిన పాయింట్స్ వద్ద ట్రాఫిక్ సమస్య లేకుండా విధులు నిర్వహిస్తున్నారు.

ఉపశమనానికి చర్యలు

విధుల్లో ఉండే సిబ్బంది ఎండ తీవ్రతను తట్టుకునేందుకు ఉన్నతాధికారులు చర్యలకు సిద్ధమవుతున్నారు. విధుల్లో ఉండే సిబ్బందికి ఎప్పటికప్పుడు మజ్జిగ, మంచినీళ్ల బాటిళ్లు, చలువ అద్దాలు, హెల్మెట్‌తో పాటు గ్లూకోన్‌డీ లాంటి వాటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నిర్విరామంగా విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది వేసవిలో మాత్రం తగు జాగ్రత్తలు తీసుకుంటూ విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

ఇష్టంతో పనిచేస్తే ఇబ్బంది ఉండదు



పోలీస్ ఉద్యోగం అంటేనే బాధ్యతతో కూడిన ఉద్యోగం. ఇబ్బంది అంటే ఇబ్బందే కానీ డ్యూటీ చేయాల్సిందే. ఏదైనా ఇష్టంతో పనిచేస్తే ఏఇబ్బందీ ఉండదు. కష్టం అనుకుని పనిచేస్తేనే ఇబ్బంది. పోలీస్ శిక్షణలో అన్ని అంశాల్లో ట్రైనింగ్ ఉంటుంది. ఆ శిక్షణతోనే విధులు నిర్వహిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. వేసవి కావడంతో ఎండతీవ్రత ఎక్కువగానే ఉంటుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు జాగ్రత్తలు తీసుకుంటూ విధులు నిర్వహిస్తాం.

- కొండ్రపల్లి అనిత, ట్రాఫిక్ పీసీ, నల్లగొండ

విధుల్లో 50 మంది పోలీస్ సిబ్బంది



నల్లగొండ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. స్టేషన్‌పరిధిలోని నల్లగొండ పట్టణంలో 18పాయింట్స్ ఉండగా మొత్తం 50మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిసున్నారు. రెండు షిఫ్టలలో విధులు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు జాతీయ రహదారిపై కూడా వేగ నియంత్రణ కోసం సిబ్బంది స్పీడ్ గన్స్ ద్వారా విధుల్లో ఉంటున్నాం.వేసవి దృష్ట్యా అధికారులు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటూ విధులు నిర్వహించాలి.

- మహాలక్ష్మయ్య, ట్రాఫిక్ సీఐ, నల్లగొండ

వేసవి నుంచి ఉపశమనం కోసం అన్నిచర్యలు



వేసవి దృష్ట్యా ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి ఉపశమనం కోసం అన్నిచర్యలు తీసుకుంటాం. ప్రతి రోజూ మజ్జిగ, మంచినీళ్లు, చలువ అద్దాలు, హెల్మెట్‌తో పాటు వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలను ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు అందించేలా ఏర్పాట్లు చేస్తాం. విధుల్లోని సిబ్బంది కూడా తమకు తాము జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండకు దూరంగా ఉంటూ వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు వహించాలి.

- కొలను శివరాంరెడ్డి, డీఎస్పీ, నల్లగొండ

విద్యుదాఘాతంతో మూగజీవాలు మృతి

తుర్కపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై రెండుగొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం బీల్యానాయక్‌తండాలో శనివారం జరిగింది.గ్రామానికి చెందిన భూక్య సీతారాం, భూక్య ఉమ్లానాయక్ చెందిన రెండు గొర్రెలు మేతకోసం వెళ్లాయి. గ్రామానికి విద్యుత్ సరాఫరా చేసే సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ షాట్ సర్క్యూట్ కావడంతో రెండు గొర్రెలు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో బాధితులకు రూ.20 వేలు నష్టం వాటిల్లింది.

వలిగొండ మండలంలోనూ

వలిగొండ: యాదాద్రిభువనగిరి జిల్లాలో విద్యుదాఘాతంతో మూగజీవాలు మృతిచెందాయి. మందాపురం గ్రామానికి చెందిన ఆవుల రామూర్తి రోజు మాదిరిగానే పశువుల పాకలో గొర్రెలు, లేగదూడలను కట్టేసి ఇంటికి వెళ్లాడు. తిరిగి తెల్లవారుజామున వచ్చి చూసేసరికి విద్యుదాఘాతానికి గురై రెండు లేగదూడలు రెండు గొర్రెలు మృతి చెందాయని తెలిపాడు. రూ.50వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

కోతుల దాడిలో మహిళకు తీవ్రగాయాలు

వలిగొండ మండలం దాసిరెడ్డిగూడెంలో కోతుల గుంపు దాడిలో ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కూనకూరి బాలమ్మ ఇంట్లోఉండగా కోతుల గుంపు దాడి చేసి గాయపరిచాయి. ఆమె కేకలతో చుట్టుపక్కల వారు వచ్చి కోతులను వెళ్లగొట్టారు. తీవ్రగాయాలైన ఆమెను కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

డీలర్ అరెస్టు

కేతేపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న డీలర్‌ను నల్లగొండ జిల్లా కేతేపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు.ఎస్‌ఐ శివతేజ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం రావులపెంట రేషన్‌డీలర్ కర్నాటి పాండురంగయ్య రేషన్‌బియ్యాన్ని కేతేపల్లి మండలం మీదుగా మార్కెట్‌కు తరలించి అధికధరకు విక్రయిస్తున్నాడు. ఈ సమాచారం అందడంతో సిబ్బందితో కాపుకాసి అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. డీలర్‌ను శనివారం కోర్టులో రిమాండ్ చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

చిట్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జల్సాల చేసేందుకు డబ్బుల కోసం గంజాయి విక్రయాలు జరుపుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కమలేష్‌పాల్, నిర్భయసింగ్ కొంతకాలంగా యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేటలో నివాసముంటూ ఐస్‌క్రీములు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. జల్సాలకు అలవాటు పడిన వారికి ఐస్‌క్రీమ్‌లు విక్రయించగా వచ్చిన డబ్బులు సరిపోవడం లేదు. దీంతో ఉత్తరప్రదేశ్ నుంచి గంజాయి తీసుకువచ్చి ఐస్‌క్రీమ్ విక్రయిస్తున్నట్లు తిరుగుతూ రామన్నపేట, చిట్యాల పరిసర ప్రాంతాల్లో కాలేజీ విద్యార్థులకు, లారీ డ్రైవర్లకు విక్రయిస్తున్నారు. శనివారం చిట్యాల పట్టణంలోని భువనగిరి రోడ్డులోని పంజాబీ దాబా సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారని చిట్యాల పోలీసులకు అందినసమాచారం మేరకు ఎస్‌ఐ ధర్మా తన సిబ్బందితో వెళ్లి అనుమానాస్పదంగా ఉన్న కమలేష్, నిర్భయసింగ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. నిందితుల నుంచి కిలోన్నర గంజాయి, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.37,500 ఉంటుందని, నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. కేసులో కీలకంగా వ్యవహరించిన హెడ్‌కానిస్టేబుళ్ల పాష, మధు, మల్లేష్, కానిస్టేబుళ్ల ఖలీమ్, నాగరాజులను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో సీఐ నాగరాజు, ఎస్‌ఐ ధర్మా పాల్గొన్నారు.



నల్లగొండలో సెల్‌ఫోన్‌లు పొందిన వారితో కలిసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

మొబైల్ చోరీలు తగ్గుముఖం

108 ఫోన్లు రికవరీ, బాధితులకు అప్పగింత

నల్లగొండ క్రైం, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) పోర్టల్ వచ్చాక మొబైల్ దొంగతనాలు తగ్గుముఖం పట్టాయని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. నల్లగొండ సబ్‌డివిజన్ పరిధిలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 108 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా టూటౌన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నల్లగొండ టూటౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీకి గురైన, పోగొట్టుకున్న ఫోన్ల ఐఎంఈఐ నెంబర్లను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశామన్నారు. దీంతో ఫోన్ ఎవరు వాడుతున్నారో ట్రాక్‌చేసి ఆ ఫోన్లను రికవరీ చేశామన్నారు. నల్లగొండ టూటౌన్ పరిధిలో 100 మంది, రూరల్ పరిధిలో 8మంది బాధితులకు సంబంధించి కానిస్టేబుళ్లు ఎల్.బాలకోటి, రేవతి ఆధ్వర్యంలో రికవరీ చేశామన్నారు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే సిమ్‌కార్డును బ్లాక్‌చేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. తద్వారా ఫోన్‌లో డాటా వేరే వారి చేతుల్లోకి పోకుండా ఉంటుందన్నారు. రికవరీ చేసిన ఫోన్లను టూటౌన్ సీఐ రాఘవరావు, ఎస్‌ఐలు ఎర్ర సైదులు, గాజుల మానస, సిబ్బంది బాలకోటి, నాగరాజు తదితరుల సమక్షంలో అందజేశారు.

అంతర్రాష్ట్ర గేదెల దొంగల ముఠా అరెస్ట్

దేవరకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గేదెల దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యులు గల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ .3.20లక్షల నగదు, అశోక్ లేలాండ్ ట్రాలీ, కారును స్వాధీనం చేసుకున్నారు. శనివారం నల్లగొండ జిల్లా దేవరకొండలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ మౌనిక వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా కోదాడ అశోక్‌నగర్‌కు చెందిన మహ్మద్ మతాబ్ సాహెబ్ గేదెల వ్యాపారం చేసేవాడు. జల్సాలకు అలవాటుపడి డబ్బులు సరిపోకపోవడంతో 2021 నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గేదెల దొంగత నాలకు పాల్పడుతున్నాడు. అతడిపై 6 గేదె దొంగతనాల కేసులు, ఒక బైక్ చోరీ కేసులు ఉన్నాయి. ఈ క్రమంలో అనేకమార్లు జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చాడు. అనంతరం కోదాడకు చెందిన రాపాని సింహాద్రి, షేక్‌రఫీ, షేక్ అస్లాం, వంటిపుల్లి అఖిల్ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వారు ఫిబ్రవరిలో యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం నూనెగూడెంలో నాలుగు గేదెలు, నల్లగొండ జిల్లా త్రిపురారంలో రెండు గేదెలు, దేవరకొండ మండలం మంగలోనిబావిలో రెండు గేదెలను ట్రాలీ ఆటోల్లో ఎత్తుకెళ్లేవారు. ఆంధ్రప్రదేశ్‌కు తరలించి ఒంగోలు నూతనపాడు సంత, చిలకలూరిపేట సంతల్లో విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సాలు చేశారు. శనివారం ఉదయం దేవర కొండ పట్టణంలోని ముదిగొండ రోడ్డులో అశోక్ లేలాండ్ ట్రాలీ, మరో కారులో దొంగతనానికి రాగా అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో దేవరకొండ సీఐ నర్సింహులు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఏఎస్పీ తెలిపారు. ముందుగా ఈ ముఠా కారులో రెక్కీ నిర్వహించి ఆ తరువాత ట్రాలీలో గేదెలను ఎత్తుకెళ్లేవారు. గేదెల దొంగలను పట్టుకున్న దేవరకొండ సీఐ నర్సింహులు, ఎస్‌ఐలు అజ్మీర రమేష్, రువ్వ కోటేష్, పోలీసులు అంజి, సతీష్, తిరుపతి, రాజారాం, యాదయ్య, సోమ్లాను ఆమె అభినందించారు. సమావేశంలో దేవరకొండ సీఐ నర్సింహులు, ఎస్‌ఐ రమేష్, కోటేష్ పాల్గొన్నారు.



దేవరకొండలో దొంగల ముఠా వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మౌనిక

ఓఆర్‌ఆర్ వద్ద రోడ్డు ప్రమాదం

నల్లగొండకు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని దుర్మరణం, ఇద్దరికి తీవ్ర గాయాలు

నల్లగొండ క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్‌ఆర్)పై జరిగిన ప్రమాదంలో నల్లగొండ జిల్లాకు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ పట్టణానికి చెందిన ఇంతియాజ్ హైదరాబాద్ రోడ్డులోని ఉడిపి హోటల్ ఎదురుగా ఫిష్ ఎంక్వేరియం నిర్వహిస్తున్నారు. ఇంతియాజ్‌కు ఇద్దరు పిల్లలు కాగా కుమార్తె అమతుల్(22) మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. కుమారుడు ఫౌజన్(24) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. అయితే రంజాన్ మాసం సందర్భంగా హైదరాబాద్ నుంచి అమతుల్‌ను నల్లగొండకు తీసుకురావడానికి శుక్రవారం వరుసకు సోదరుడు షాదాబ్ కలిసి షాదాబ్ కారులో హైదరాబాద్ వెళ్లారు. మేడ్చల్‌లో అమతుల్‌ను తీసుకుని కారులో నల్లగొండకు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో శక్రవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఓఆర్‌ఆర్ కీసర ప్రాంతంలో వర్షం పడుతుండటంతో రోడ్డుపై అదుపు తప్పింది. రోడ్డు పక్కనే ఉన్న డివైడర్‌ను ఒక్కసారిగా ఢీకొట్టడంతో అమతుల్(22)కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. కారు నడుపుతున్న షాదాబ్‌కు స్వల్పగాయాలు కాగా ఫౌజాన్‌కు తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అమతుల్ మృతదేహాన్ని శనివారం నల్లగొండకు తీసుకువచ్చారు. అమతుల్ మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. అశ్రునయనాల మధ్య అమతుల్ అంత్యక్రియలను నిర్వహించారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

తిరుమలగిరి రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి సూర్యాపేట మండలం తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చెరుకు నరసింహ(70) శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో గ్రామం నుంచి ఎస్సీకాలనీకి వస్తుండగా నాగారం మండలంలోని వర్ధమానుకోట చెందిన వట్టె నర్సయ్య వెలిశాల నుంచి మోపెడ్‌పై ఎదురుగా వస్తూ ఢీకొట్టాడు. ఈ ఘటనలో నర్సయ్యకు గాయాలుకాగా సూర్యాపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నరసింహ కుమారుడు సైదులు ఫిర్యాదుమేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

లైంగికదాడి కేసులో మరొకరి అరెస్టు

హుజూర్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : యువతిపై లైంగిక దాడి కేసు నిందితుల్లో మరొకరిని అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. మేళ్లచెర్వుకు చెందిన ఓ యువతిపై అత్యాచారం, కిడ్నాప్, గాయపరిచి, వేధించి, నిర్బంధించిన కేసులో తప్పించుకుని తిరుగుతున్న ఏ-2 లచ్చమళ్ల హరీష్‌ను శనివారం అరెస్టు చేశామన్నారు. ఈ నెల 18న హుజూర్‌నగర్‌లో బాధితురాలిని మరో ఇద్దరితో కలిసి హరీష్ బలవంతంగా కారులో ఎక్కించుకుని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగికంగా కలవాలని లేకుంటే ఫొటోలు బయటపెట్టి చంపుతామని బెదిరించినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఇద్దరిని రెండు రోజుల కిందటే అరెస్ట్ చేశామన్నారు. పరారీలో ఉన్న హరీష్ అతడి ఇంటి వద్ద ఉండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా అతడి ఫోన్ సీజ్‌చేసినట్లు తెలిపారు. ఇదిలాఉండగా పట్టణంలో వివిధ హోదాల్లో ఉన్న వ్యక్తులతో గతంలో నిందితులు ఫొటోలు దిగిన వాటిని వాట్సాప్ గ్రూపుల్లో, సోషల్‌మీడియాలో పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చరమందరాజు హెచ్చరించారు. గౌరవ ప్రదమైన వ్యక్తులకు సంబంధించి నిందితులు ఫొటోలు పెట్టవద్దన్నారు. వివిధ కేసుల్లో ఉన్న వ్యక్తులు ఫొటోలు సోషల్‌మీడియాలో పెడితే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వేములపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు శనివారం తెలిపిన వివరాల ప్రకారం రావులపెంట గ్రామానికి చెందిన శీలం సైదులు, ఇంద్రపల్లి సుదర్శన్ అనమతులు లేకుండా గ్రామశివారులోని పాలేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఈ మేరకు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్లపై, ట్రాక్టర్ల యజమానులు శీలం సైదులు, ఇంద్రపల్లి సుదర్శన్‌లతో పాటు సుదర్శన్ ట్రాక్టర్ డ్రైవర్ పుట్ట ఉపేందర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలి

నల్లగొండ క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లాలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఎస్పీ(స్పెషల్ బ్రాంచ్) రమేష్ సూచించారు. ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఎన్‌జీ కళాశాల నుంచి బస్టాండ్ వరకూ సే నో టూ డ్రగ్స్ అనే నినాదంతో 2కే రన్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. దేశంలో అధికశాతం ఉన్న యువత డ్రగ్స్ గంజాయి బారినపడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడానికి జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. స్పెషల్ కిట్ల ద్వారా గంజాయి తాగే వారిని గుర్తించి మొదటిసారి కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. అదేసమయంలో విక్రయాలు జరిపే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్షుడు అనంతుల శంకరయ్య, ఎస్‌ఎఫ్‌ఐ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, నాయకులు గుండాల నరేష్, కట్ట లింగస్వామి, నల్పరాజు సైదులు, కోట్ల అశోక్‌రెడ్డి, పాలది కార్తీక్, మరుపాక కిరణ్, కావ్య, స్పందన, పోకల శశి, సైఫ్, సాయి, నవదీప్, భీమగాని గణేష్, షరీఫ్, బాలరాజు, మహేష్, నాగయ్య తదితరులు ఉన్నారు.



సే నో టూ డ్రగ్స్ ర్యాలీలో పాల్గొన్న ఏఎస్పీ రమేష్

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కళాశాల స్థాయిలో వచ్చే ఉపాధి అవకాశాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌కేఎస్‌ఎస్ ప్లేస్‌మెంట్ ప్రతినిధి కేఎన్‌డీ.మూర్తి, ఉమెన్స్ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ సూచించారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల కోసం ప్రముఖ మొబైల్ కంపెనీ యాపిల్ సంస్థలో విడి భాగాలను సమకూర్చే పనికి నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో వారు హాజరై మాట్లాడారు. ఈ డ్రైవ్‌లో ఎంపికైన వారికి ప్రతి నెల రూ.17,200(హాస్టల్ వసతితో కలిపి) చెల్లించనున్నారన్నారు. క్యాంపస్ పూర్తిగా ఆధునీకరించబడి సెంట్రలైజ్ ఏసీలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. క్యాంపస్‌లోనే హాస్టల్ సదుపాయం, భోజన వసతి కూడా ఉంటుందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మహిళలు సుమారు 200మందికి పైగా హాజరయ్యారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ ఈ.రామ్‌రెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ సుదర్శన్‌రెడ్డి, గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సుంకరి రాజారాం, టీఎస్‌కేసీ ఫుల్‌టైం మెంటర్ అయేషా ఉన్నారు.



ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో మాట్లాడుతున్న ఎస్‌కేఎస్‌ఎస్ సంస్థ ప్రతినిధి మూర్తి

మిస్ వరల్డ్ పోటీదారులకు ఏర్పాట్లు చేయాలి

● పర్యాటకశాఖ ఎండీ ప్రకాష్‌రెడ్డి ● నాగార్జునసాగర్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్‌తో కలిసి సమీక్ష



బుద్ధవనం పరిశీలిస్తున్న ఎండీ ప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అధికారులు

నాగార్జునసాగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని మిస్‌వరల్డ్ పోటీ దారులు మే 12న సందర్శించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేయాలని పర్యాటకశాఖ ఎండీ ఎస్.ప్రకాష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి సాగర్ హిల్‌కాలనీలో బుద్ధవనాన్ని శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం బుద్ధవనం సమావేశ మందిరంలో పర్యాటక, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ మిస్ వరల్డ్ -2025 పోటీలు మే 7 నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పోటీలకు అందాల భామలు, విదేశీ ప్రతినిధులు హాజరుకానున్నట్లు, వారి ద్వారా హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పర్యాటక కేంద్రాలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చేందుకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రణాళిక రూపొందిస్తోందని అన్నారు. అందులో భాగంగా పోటీదారులు మే 12న సాగర్ సందర్శించి బుద్ధవనం, విజయవిహార్, సాగర్ ప్రధానడ్యాం, పర్యాటక శాఖ లాంచీలో జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండలను సందర్శించే అవకాశం ఉందన్నారు. విదేశీ ప్రతినిధులు, అందాల భామల పోటీదారులు బుద్ధవనాన్ని ఒక పర్యాటక ప్రాంతంగా, ధ్యాన కేంద్రంగా చూపించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా బుద్ధవనం పేరు ప్రతిష్టలను చాటి చెప్పే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొని సాగర్‌కు వచ్చే యువతులు గద్వాల, పోచంపల్లి, చీరల ప్రాముఖ్యతను, తెలంగాణ పర్యాటకం, చేతి వృత్తులు, కలంకారీ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. 140 దేశాల నుంచి 140 మంది ప్రపంచ అందాల భామలు పోటీల్లో పాల్గొనే పోటీదారులల్లో ఆసియా నుంచి 30 మంది పాల్గొనునున్నట్లు వివరించారు. అంతకు ముందు పర్యాటక శాఖ ఎండీ ప్రకాష్‌రెడ్డికి ఎస్పీ శరత్ చంద్ర పవావర● పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో బుద్ధవనంలో మరింత పచ్చదనం పెంచేలా మొక్కలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బుద్ధవనంలో తెలంగాణ పర్యాటక విశిష్టతను తెలిసేలా వీడియో షోలు ఏర్పాటు చేయాలని అకారులను కోరారు. కాగా మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్ ఇన్‌చార్జి వ్యవహరిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

పూర్తి స్థాయి భద్రత కల్పిస్తాం: ఎస్పీ

ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొని సాగర్ బుద్ధవనం సందర్శనకు వచ్చే పోటీదారులందరికీ పోలీస్‌శాఖ తరుపున పూర్తి స్థాయిలో భద్రతను కల్పిస్తామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలి పారు. ఆ రోజు బుద్ధవనానికి వచ్చే వారికి ప్రత్యేక పాసులు జారీ చేస్తామన్నారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, బుద్ధవనం ఓఎస్‌డి సుదన్‌రెడ్డి, పురావస్తు శాఖ విశ్లేషకులు డాక్టర్ ఈమని శివ నాగి రెడ్డి, పర్యాటక శాఖ జనరల్ మేనేజర్లు సూర్యప్రకాష్, ఇబ్రహీం, ఎఫ్‌డీవో సంగీత, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

ఆశలు ఆవిరై..పంట భారమై



గుండాల మండలం రామారం గ్రామంలో తెగుళ్లతో ఎండిపోయిన మిర్చి

ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక పోవడంతో మిర్చి రైతులు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. గతేడాది తెగుళ్ల బెడద తక్కువగా ఉండి అధిక దిగుబడి రావడంతో పాటు ధర కూడా అధికంగా ఉండడంతో రైతులు ఎన్నో ఆశలతో ఈ ఏడాది మిర్చి సాగు చేశారు. కానీ వారికి కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మార్కెట్ లో ఉన్న ధరలను చూస్తే పంట పూర్తిగా విక్రయించినా పెట్టుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

- (ఆంధ్రజ్యోతి- గుండాల)

వాతావరణంలో వచ్చిన మార్పులతో ఈ ఏడాది మిర్చిలో ఎర్ర నల్లి, నల్ల తామర, వేరుకుళ్లు, ముడ త వంటి తెగుళ్లతో సాగు వ్యయం విపరీతంగా పెర గడంతో పాటు దిగుబడిపై కూడా ప్రభావం పడింది.

గతేడాది ఎకరానికి 20 క్వింటాళ్ల పైన దిగుబడి వస్తే ఇప్పుడు 10 క్వింటాళ్లలోపే దిగుబడి వచ్చింది. దీంతో తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని రకాల వంగడాలు మార్చినా అదే పరిస్థితి నెలకొనడంతో రైతులు గతంలో లాగా మిర్చి పంటపై దృష్టి పెట్టడం లేదు. గతంలో

ధర పతనంతో ఆందోళనలో మిర్చి రైతులు

మండలంలోని గుండాల, నూనెగూడెం, సీతారాంపురం, రామారం, గంగాపురం, వెల్మ జాల, బ్రాహ్మణపల్లి, గుండాల తదితర గ్రామాల్లో మిర్చి పంటను అధికంగా సాగు చేసే వారు. మండల ప్రజలు మిర్చి పండించిన రైతుల వద్దకు వెళ్లి కొనుగోలు చేయడం వల్ల రైతుతో పాటు కొనుగోలు చేసిన వారికి కూడా లాభదాయకంగా ఉండేది. వరుసగా వస్తున్న నష్టాల వల్ల సాగు విస్తీర్ణం తగ్గడంతో పాటు దిగుబడి తగ్గు తుండడంతో మండల ప్రజలు జనగాం, మోత్కూరు, పట్టణ ప్రాంతాలకు వెళ్లి మిర్చిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రజలకు అదనపు భారం పడుతోంది.

ముఖం చాటేస్తున్న వ్యాపారులు..

గతంలో మిర్చి సాగు చేసే వ్యాపారులు పంటను చూసి కొంతమేర ముందస్తుగా నగదు సాయం చేసేవారు. ఇప్పుడు దిగుబడి తగ్గడంతో పాటు మార్కెట్‌లో ధర లేకపోవడంతో వ్యాపారులు ముఖం చాటేస్తున్నారు. ఇదే సీజన్‌లో గతేడాది క్వింటాకు రూ. 20 వేల నుంచి 24వేల వరకు కొనుగోలు చేయగా ఇప్పుడు రూ. 6,500 నుంచి రూ.12,500 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దిగుబడి తగ్గడంతో పాటు పంట ధర కూడా తగ్గడంతో రైతులకు పెట్టుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. తద్వారా అప్పు ఏ విధంగా తీర్చాలో తెలియని పరిస్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

పెరిగిన పెట్టుబడులు..

వాతావరణంలో వస్తున్న మార్పులతో తెగుళ్ల బెడ దతో పంటకు పెట్టుబడి కూడా విపరీతంగా పెరిగిం ది. గతంలో ఎకరాకు రూ.1.50 లక్షల పెట్టుబడి వస్తే ఈ ఏడాది ఎండలు విపరీతంగా ఉండడంతో కూలీ లకు రోజుకు ఒక్కొక్కరికీ రూ.400 నుంచి 500వరకు చెల్లించాల్సి వస్తుంది. దీంతో ఈ ఏడాది ఎకరాకు రూ. 2లక్షల వరకు పెట్టుబడి వస్తుంది. పంట ఏరితే కూళ్ల మీద పడుతుండడంతో కొంతమంది రైతులు పంటను ఏరకుండా వదిలేస్తున్నారు.

పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు



ప్రతి సంవత్సరం లాగా ఈ ఏడాది కూడా రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశా. ప్రతి సంవత్సరం ఎకరాకు 20 క్వింటాళ్ల పైన దిగుబడి వచ్చేది. ఈ ఏడాది చీడపీడల బెడద వల్ల 10 క్వింటాళ్ల లోపు దిగుబడి వచ్చింది. దీంతో అధికంగా నష్టపోయాను.

- శంకరయ్య, రైతు, సీతారాంపురం

భారీగా తగ్గిన మిర్చి ధర



గతేడాది మిర్చి ధర అధికంగా ఉండడంతో ఈ ఏడాది రెండున్నర ఎకరాల్లో మిర్చి సాగు చేశా. ఈ ఏడాది దిగుబడి తక్కువ రావడంతో పాటు మార్కెట్‌లో మిర్చి ఎకరాకు రూ. 120వేల వరకే కొనుగోలు చేస్తున్నారు. గతే డాది రూ. 24 వేలకు వ్యాపారులు కొనుగోలు చేయగా ఈ ఏడాది క్వింటాల్‌కు రూ.12 వేలకే కొనుగోలు చేశారు. దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. దీంతో రూ.2 లక్షల అప్పు మీద పడింది. అప్పు ఏ విధంగా తీర్చాలో తెలియని పరిస్థితి నెలకొన్నది.

- దూదిగాని నాగరాజు రైతు , గంగాపురం

ఇంటిగ్రేటెడ్ కోర్సుతో ఉజ్వల భవిష్యత్తు

● ఎంజీయూ ఉపకులపతి అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ ఐపీపీ కోర్సుతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంజీయూ ఉపకులపతి అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. రీసెంట్ అడ్వాన్స్ ఇన్ ఫార్మెటికల్ సెమినార్‌లో భాగంగా ఎంఎస్సీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటికల్ కోర్సుకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్సు పూర్తి చేసిన పూర్వ విద్యార్థులందరూ ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎన్, ఎన్ఏటీసీవో, మైలాన్ కంపెనీల అధిపతులు, ఆధ్యాపకులు, డీన్ వసంత, డాక్టర్ రూప, ప్రశాంతి, అన్నపూర్ణ, రమేష్, జ్యోతి, కల్యాణి, శ్రీధర్, అభిలాష్, తిరుపతయ్య, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేఘాల పరిశోధనపై దృష్టి సారించాలి

కృత్రిమ మేఘాల పరిశోధనలపై ఇంజనీరింగ్ విద్యార్థులు దృష్టి సారించి మెరుగైన అవకాశాలు పొందాలని ఎంజీయూ ఉపకులపతి ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల సిద్ధిపేటలో జరిగిన జాతీయ స్థాయి సెమినార్‌లో ఎంజీయూ ఇంజనీరింగ్ విద్యార్థుల పరిశోధన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విద్యార్థులు గంజి పవన్, షేక్ షరీఫ్, పవన్ కుమార్, సందీప్ పాల్గొన్నారు.

కంటి చూపు కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కనగల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కంటి చూపును కోల్పోకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని జిల్లా కంటి వైద్య నిపుణురాలు సువర్ణ మహేంద్ర అన్నారు. నల్లగొండ జిల్లా కనగల్ పీహెచ్‌సీలో గ్లకోమా పైలట్ ప్రాజెక్ట్ కింద శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 83 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలున్న వారికి అవసరమైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా కనగల్ పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ మాట్లాడుతూ 40 ఏళ్ల పైబడిన వారు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు బిసిన్ సంతోష్, మోహిత్ ప్రకాశ్ జితేందర్, రామకృష్ణ తదితరులున్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



గర్భాలయ ఉభయ క్యూలైన్లలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 40,20,232 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కాగా, ఉదయం యాద్రాద్రి భువనగిరి జోన్ డీసీపీ ఆక్రాంశ్ యాదవ్ (తొలిసారి), ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులతో యాదగిరికొండపై రద్దీ నెలకొంది. సుమారు 34 వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ఉభయ క్యూలైన్లల్లో రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనాలకు అరగంట ధర్మదర్శనాలకు గంట సమయం పట్టింది.

గ్రామీణ ప్రాంత రోడ్ల విస్తరణకు త్వరలో టెండర్లు

● పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

చౌటుప్పల్ టౌన్/మునుగోడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత రోడ్ల ను 3.5 నుంచి 5.5 మీటర్ల వరకు విస్తరించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసి, త్వరలో టెండర్లను పిలవనున్నట్లు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. శనివారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో పాల్గొన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గ్రామీణ ప్రాంత రహదారుల విస్తరణకు పలు సూచనలు, సలహాలె చేశారు. రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీని పరిగణనలోకి తీసుకొని గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను 3.5 నుంచి 5.5 మీటర్ల వరకు వెడల్పు చేయాలని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్టు మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తెలిపారు. రవాణా వ్యవస్థను మెరుగు పరిచేందుకు చేపడుతున్న రోడ్ల విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.



సమీక్షలో పాల్గొన్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

ఖైదీలు సత్ప్రవర్తనను పెంపొందించుకోవాలి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి జయరాజు

భువనగిరి టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జైలు జీవితంలో ఖైదీలు సత్ప్రవర్తనను పెంపొందించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయ అధికారి జయరాజు అన్నారు. శనివారం భువనగిరి సబ్‌జైలులో ఖైదీలతో నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. పలు కారణాలతో కేసుల్లో ఇరుక్కుని జైలు పాలైన ఖైదీలు నేర ప్రవృత్తిని విడనాడేందుకు మానసికంగా జైలు జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన ఖైదీలకు న్యాయ సాయం అందిస్తామని అన్నారు. జైలులో లభిస్తున్న వసతులు కోర్టుకు హాజరు తీరును అడిగి తెలుసుకున్నారు. జైలు నిర్వహణపై అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మాధవీలత, జైలు సూపరింటెండెంట్ ఎం.నెహ్రూ పాల్గొన్నారు.



ముఖాముఖిలో మాట్లాడుతున్న జయరాజు

'వాట్సప్‌లో ప్రశ్నపత్రం' ఎవరికోసం..?

(5వ పేజీ తరువాయి)

తీస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పూర్తిభద్రతతో పాటు, ఫోన్లకు అనుమతి లేదని, వంద మీటర్ల వరకు బీఎన్‌ఎస్‌ఎస్ 163 సెక్షన్ అమలు ఉంది. అయినా ఫొటో తీసిన వ్యక్తి పరీక్షా కేంద్రంలోకి ఎలా వచ్చారనే అంశంపై విచారణ చేస్తున్నారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసు సిబ్బంది, పరీక్షల అధికారులు, ఇన్విజిలేటర్లను దాటుకొని సదరు వ్యక్తి పరీక్షా కేంద్రంలోకి ఎలా వెళ్లారని ఆరా తీస్తున్నారు. పరీక్షా హాల్‌లోకి వెళ్లి మొబైల్ ఫోన్లో ఫొటో తీసేంతవరకు ఎవరూ ఎందుకు స్పందించలేదు అనేది పరిశీలించాల్సిన అంశంగా భావిస్తున్నారు. అందుబాటులో ఉన్న బాలిక ప్రశ్నాపత్రాన్ని ఫొటో తీయడంతో సదరు బాలికను డీబార్ చేశారు. విషయం బయటకు పొక్కడంతో శుక్రవారం హడావుడిగా విచారణ జరిపి లోలోపల విషయాన్ని దాటవేయాలని చూశారని తెలుస్తోంది. అప్పటికే విషయం పూర్తిగా బయటకు రావడంతో అర్ధరాత్రి దాటాక అప్పటికప్పుడు ఇన్విజిలేటర్‌ని సస్పెండ్ చేశారని, అదేవిధంగా సీఎస్‌ని, డీవోని విధుల నుంచి తొలగించారని భావిస్తున్నారు. మొత్తంగా ఈ ప్రశ్నాపత్రం ఎవరు ఫొటో తీశారనే విషయాన్ని తేల్చాలని, ఎవరి కోసం ఈ ఘటనకు పాల్పడ్డారో విచారణలో తేల్చాలని, ఒకరిద్దరి కోసమే చేశారా..? లేక ఇతర ప్రైవేట్ శక్తుల ప్రయోజనాలు ఉన్నాయా..? అనే అంశాన్ని విచారణలో తేల్చాలనే డిమాండ్ వెలువడుతోంది. పరీక్షా కేంద్రాల వద్ద పూర్తి అప్రమత్తంగా ఉండాల్సిన పోలీసుల నిర్లక్ష్యం, పరీక్షా కేంద్రం నిర్వహణాధికారుల పాత్ర కూడా విచారణలో తేలనుందని చెబుతున్నారు. ఆదివారంలోగా పూర్తి విచారణ నిర్వహించి వివరాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు విద్యాశాఖ, పోలీస్‌శాఖ వర్గాలు చెబుతున్నాయి. విచారణ నివేదిక వచ్చాక బాధ్యులైన అధికారులు, ఉద్యోగులపై వేటు తప్పదని తెలుస్తోంది.

పేపర్ లీక్‌పై లోతుగా పోలీసుల విచారణ

పరీక్ష కేంద్రం నిర్వాహకులను రెండో రోజు కూడా విచారిస్తున్నారు. ఓ మైనర్ బాలుడు ప్రశ్నపత్రాన్ని ఫొటో తీశారని చర్చ జరుగుతోంది. అయితే సదరు బాలుడు ఎవరి కోసం ఈ ఫొటో తీశారనే కోణంలో ఆరా తీస్తున్నట్లు తెలిసింది. నల్లగొండ, నకిరేకల్ పోలీసులు దీనిపై దృష్టి పెట్టి కాల్ రికార్డింగ్స్, వాట్సప్ మెసేజ్ డేటా సేకరిస్తున్నట్లు తెలిసింది

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	519.70
టీఎంసీలు	148.7299
ఎడమకాల్వకు నీటి విడుదల	7,190
కుడికాల్వకు	7,033
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	16,023క్యూసెక్కులు

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.58 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46 (టీఎంసీలు)
ప్రస్తుత నీటి మట్టం	629.82 అడుగులు
టీఎంసీలు	1.37 (టీఎంసీలు)
కాల్వలకు విడుదల	362.88 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	428.61 క్యూసెక్కులు

వెనుకబడిన విద్యార్థులకు ఏఐతో బోధన

(5వ పేజీ తరువాయి)

ఈ విధంగా ప్రతీ విద్యార్థి అభ్యాసన సామర్థ్యాలను మదింపు చేయడంతో పాటు గతంతో పోలిస్తే ఆ విద్యార్థి పురోగతి ఎలా ఉందో పరిశీలించి ఆ నివేదికను ఉపాధ్యాయులు తయారు చేసి ప్రభుత్వానికి అందించనున్నారు.

ఏఐ బోధనపై శిక్షణ పూర్తి

ఏఐ బోధన కోసం ప్రతీ జిల్లాలో పలు పాఠశాలలను ఎంపికచేశారు. ఆయా పాఠశాలల్లో బోధించేందుకు నిపుణులైన ఉపాధ్యాయులు, జిల్లా సమన్వయ అధికారులకు రాష్ట్రస్థాయిలో శిక్షణఇచ్చారు. అనంతరం జిల్లాకేంద్రాల్లో ఎంఈవోలు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంపిక చేసిన పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడి చొప్పున ఏఐ బోధనపై శిక్షణ పూర్తిచేశారు.

ఉమ్మడి జిల్లాలో అమలు ఏఐ తరగతులను ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో మాత్రమే ప్రస్తుతానికి అమలుచేస్తున్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు కలిపి ఉన్న పాఠశాలలనే ఇందుకు ఎంపికచేశారు. ఉన్నత పాఠశాలల్లోని కంప్యూటర్ ల్యాబ్‌లను ఏఐ తరగతులకు వినియోగిస్తున్నారు. 3, 4, 5 తరగతుల్లో విద్యలో వెనుకబడిన సీ-గ్రేడ్ విద్యార్థులను గుర్తించి, వారికి మాత్రమే ఏఐ ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. ఇందుకోసం ఏఐ పాఠాల కోసం యాక్సెల్-ఎక్స్‌స్టెప్ ఫౌండేషన్ కంపెనీ సహకారంతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఏఐ పాఠాలు బోధిస్తున్నారు.



చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్ పాఠశాలలో ఏఐ తరగతులను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు (ఫైల్)

వెనుకబడిన విద్యార్థులకు మేలు

విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ఏఐ పాఠాలు ఎంతో మేలు చేయనున్నాయి. గణితంలో బేసిక్స్‌ను ఏఐ పాఠాల ద్వారా నేర్చుకునే అవకాశం ఉంది. ప్రాథమిక పాఠశాల్లోని 3, 4, 5 తరగతుల్లో కొంతమంది విద్యలో రాణించలేకపోతున్నారు. అలాంటి వారికి ఏఐ ద్వారా పాఠాల బోధన మెరుగైన సామర్థ్యాలను సాధించే అవకాశం లేకపోలేదు. ఏఐ పాఠాల కోసం విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి మాత్రమే అందిస్తున్నాం.

-అశోక్, డీఈవో, సూర్యాపేట.

కాలు విరిగి శునకం విలవిల

● చికిత్స చేసిన ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య

కోదాడ రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని ఏరియా ఆసుపత్రి ఉద్యోగి అనంతారపు లక్ష్మి పెంపుడు శునకం శనివారం తెల్లవారుజామున కారు ఢీకొనడంతో గాయపడింది. వెనుక కాలు విరిగి నరాలు తెగి, ఎముకలు బయటికి రావడంతో వైద్యం కోసం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకొచ్చారు. దీంతో కాలు తీవ్రతను పరిశీలించిన అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి. పెంటయ్య సిబ్బంది సహాయంతో శస్త్రచికిత్స చేసి తెగిన నరాలను అనుసంధానం చేసి అతికించారు. విరిగి, తొలగిన ఎముకలను సరిచేసి కుట్లు వేశారు. ఆర్థోపెడిక్ సర్జరీ తరహాలో సిమెంట్ కట్టు వేశారు.



చికిత్స చేస్తున్న డాక్టర్ పెంటయ్య

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బస్టాండ్, డాక్టర్స్ కాలనీ, సతీష్‌నగర్, అన్సారి కాలనీ, గవర్నమెంట్ ఆస్పత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ ఎం. వేణగోపాలాచార్యులు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సరఫరాలో కలిగే అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

మునుగోడు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అధికారులకు పాలన పగ్గాలు కటబెట్టి నిధులు ఇవ్వకుండా సమస్యలను పెంచుతున్నారని ఆరోపించారు. 25వ తేదీన తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

పన్ను కట్టకపోతే పవర్ కట్





నల్లగొండ మునిసిపల్ కార్యాలయం, (ఇన్‌సెట్‌లో) ఆస్తులను సీజ్ చేసిన మునిసిపల్ అధికారులు

- ఆస్తి పన్ను వసూళ్లకు నూతన కార్యాచరణ
- బకాయిదారులకు కరెంట్ కనెక్షన్ కట్...!
- గృహాల ముందు డప్పు చప్పుళ్లతో వినూత్న నిరసన
- కార్యాచరణ రూపొందించిన అధికారులు
- నూరు శాతం వసూలు చేసేందుకు చర్యలు

రామగిరి, నల్లగొండ 21(ఆంధ్రజ్యోతి): నల్లగొండ మునిసిపాలిటీలో పేరుకుపోయిన ఆస్తి పన్ను బకాయిలను వసూలు చేసేందుకు మునిసిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నెల చివరిలోగా నూరుశాతం వసూళ్లే లక్ష్యంగా అధికారులు వివిధ రకాల ప్రణాళికలు రూపొందించారు. కమర్షియల్ బకాయిదారులకు విద్యుత్ అధికారుల సహకారంతో ఆయా విద్యుత్ కనెక్షన్లను కట్ చేయడంతో పాటు మంచినీటి సరఫరా నిలిపివేయాలని, రెసిడెన్షియల్ గృహాల బకాయిదారుల ఇళ్ల ముందు డప్పు చప్పుళ్లతో నిరసన తెలిపి ఆస్తి పన్ను వసూలు చేసేందుకు సరికొత్త ఆలోచనతో ప్రణాళికలు రూపొందించారు. విద్యుత్ అధికారుల బృందం, 10 మంది డప్పు చప్పుళ్లదారులతో కలిసి ఇంటింటికి తిరిగేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నల్లగొండ పట్టణంలో 1200 మంది బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసులకు కొంతమంది స్పందించగా మరి కొంతమంది నిర్లక్ష్యంగా ఉంటున్నారు. దీంతో ఆయా బకాయిదారుల నుంచి వసూళ్లే లక్ష్యంగా మునిసిపల్ అధికారులు వివిధ ప్రణాళికలు రూపొందించారు.

బకాయిలు రూ.37కోట్ల పైచిలుకు...

నీలగిరిలో 48 వార్డులకు గాను 36,150 నివాసగృహాలు, 3,481 కమర్షియల్ గృహాలు ఉన్నాయి. ఈ రెండు కలుపుకొని 2,447 గృహాలు ఉండగా మొత్తంగా 42,078 గృహాలు ఉన్నాయి. అయితే వీటి నుంచి ప్రతి ఏడాది రూ.16.62 కోట్ల ఆదాయం ఆస్తిపన్ను రూపేణా రావాల్సి ఉంది. ఇకపోతే వీటిపై పాత బకాయిలు రూ. 14.91 కోట్ల పైచిలుకు ఉంది. వీటిపై జరిమానాను కలుపుకొని రూ.48.41 కోట్ల బకాయి ఉంది. అయితే నేటి వరకు సుమారు రూ. 12 కోట్ల వరకు వసూళ్ల కాగా రూ.37 కోట్ల పైచిలుకు అద్దె రూపేనా రావాల్సిఉంది.

వసూళ్లే లక్ష్యంగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు

మార్చి చివరినాటికి ఆస్తి పన్ను వందశాతం వసూలు చేయాలన్న లక్ష్యంతో మునిసిపల్ అధికారులు ప్రత్యేకంగా 16 బృందాలను ఏర్పాటు చేశారు. వీరితో పాటు మునిసిపల్ కమిషనర్, రెవెన్యూ అధికారికూడా ఆస్తి పన్ను వసూళ్ల కోసం తిరగనున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.13 కోట్ల పైమాటే...

నల్లగొండ పట్టణంలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి 96 కార్యాలయాలు ఉండగా రాష్ట్ర ప్రభుత్వం సంబంధించి 300 కార్యాలయాలు ఉన్నాయి. వీటి నుంచి ప్రతి ఏడాది రూ.88.5 కోట్ల ఆదాయం రావాల్సి ఉంది. కానీ రూ.4 కోట్ల పైచిలుకు మాత్రమే వసూలయ్యాయి. ఇక సుమారు రూ.13కోట్ల పై చిలుకు ఆస్తి పన్ను రూపేనా మునిసిపాలిటీకి రావాల్సి ఉంది.

ఇప్పటికే 1200 మందికి రెడ్ నోటీసులు

పట్టణంలో రూ.50వేలకు పైబడి ఉన్న 1200 మంది బకాయిదారులకు ఇటీవల కాలంలోనే మునిసిపల్ అధికారులు రెడ్ నోటీసులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం రెడ్ నోటీసులు అందుకున్న వారు వారం రోజుల్లో స్పందించాల్సి ఉంటుంది. ఇందులో కొంతమంది బకాయిలు చెల్లించగా మరికొంతమంది నిర్లక్ష్యం వీడటం లేదు. దీంతో మునిసిపల్ అధికారులు ఆయా గృహాల ముందు డప్పు చప్పుళ్లతో నిరసన తెలపడంతో పాటు, వాహనాలు, ఆస్తులను జప్తు చేసేందుకు అధికారులు తగు ప్రణాళికలు రూపొందించారు. ప్రధానంగా కమర్షియల్ గృహ యజమానులే బకాయిలు పెద్ద ఎత్తున ఉండటంతో వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇకపోతే ఇప్పటికే కొన్ని కమర్షియల్ గృహాలను జప్తు చేశారు.

ఆస్తి పన్ను చెల్లించాలి



ఆస్తిపన్ను చెల్లించాలని బకాయిదారులందరికీ ఇప్పటికే పలు మార్లు నోటీసులు ఇచ్చాం. అయినా కొంతమంది మాత్రం నిర్లక్ష్యం వీడటం లేదు. అలాంటి వారి ఆస్తి పన్ను చెల్లించని బకాయిదారులకు జిల్లా ఉన్నతాధికారుల అనుమతితో విద్యుత్ కనెక్షన్ కట్ చేయడంతో పాటు గృహాల ముందు డప్పు చప్పుళ్లతో నిరసన తెలియజేసి అయినా సరే ఆస్తి పన్ను వసూలు చేస్తాం. అవసరమైతే వాహనాలతో పాటు ఆస్తులను జప్తు చేస్తాం.

- శివరాంరెడ్డి, మునిసిపల్ రెవెన్యూ అధికారి

మొత్తంగా వివిధ గృహాలు ప్రభుత్వ కార్యాలయాలు కలుపుకుంటే రూ.50 కోట్ల పైచిలుకు రావాల్సింది. అయితే అధికారులు మాత్రం కమర్షియల్, రెసిడెన్షియల్ గృహాలు వంటి వాటిపై మాత్రమే దృష్టి సారించారు.

వివిధ గృహాలు	రావాల్సింది	వసూళ్లు (కోట్లలో)	బకాయి (కోట్లలో)
రెసిడెన్షియల్ :36283	2534.42	606.1	1928.32
కమర్షియల్ :3462	1571.53	494.77	1076.96
మిక్సిడ్ :2448	668.85	259.36	409.49
మొత్తం :42193	4775	1360.23	3414.77
ప్రభుత్వ కార్యాలయాలు	రావాల్సింది (కోట్లలో)	వసూళ్లు (కోట్లలో)	బకాయి (కోట్లలో)
కేంద్ర ప్రభుత్వం : 96	229.63	0	229.63
రాష్ట్ర ప్రభుత్వం :300	1102.75	11.26	1091.49
మొత్తం :396	1322.38	11.26	1321.12
కేంద్ర, రాష్ట్ర కార్యాలయాలు, వివిధ గృహ నిర్మాణాలు మొత్తం			
అసెస్‌మెంట్స్	రావాల్సింది (కోట్లలో)	వసూళ్లు (కోట్లలో)	బకాయి (కోట్లలో)
42589	6107.38	1371.49	4735.89

బిల్లులు చెల్లించి సంస్థకు తోడ్పడాలి


విద్యుత్ బిల్లుల వసూలును పరిశీలించిన ఏడీఈ బాల్యానాయక్

నార్కట్‌పల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులను సత్వరమే చెల్లించి ట్రాన్స్‌కో సంస్థ అభివృద్ధికి వినియోగదారులు తోడ్పాటును అందించాలని ట్రాన్స్‌కో నల్లగొండ ఏడీఈ బాల్యానాయక్ అన్నారు. నార్కట్‌పల్లిలో శనివారం విద్యుత్ బకాయి బిల్లుల వసూళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నల్లగొండ సబ్ డివిజన్ పరిధిలో గృహజ్యోతి పోగా రూ.2.03కోట్ల బిల్లులు బకాయి ఉన్నట్లు తెలిపారు. నార్కట్‌పల్లి మండలానికి సంబంధించి రూ.73 లక్షలకు రూ.38లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. ఏరియర్స్‌కు సంబంధించి రూ.22 లక్షలకు గాను రూ.9 లక్షలు వసూలు చేసినట్లు వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులందరూ బకాయిలు లేకుండా బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఏడీఈ వెంట స్థానిక ఏఈ కే.చంద్రశేఖర్‌రావు, లైన్‌మన్, ఏఎల్‌ఎం, హెల్పర్లు ఉన్నారు.

కార్పొరేట్ క్షవరశాలలకు అనుమతి ఇవ్వవద్దు

చిట్యాల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ క్షవరశాలలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వవద్దని, క్షవర వృత్తిపై నాయిబ్రాహ్మణులకు పేటెంట్ హక్కులు కల్పించాలని నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చికిలంమెట్ల అశోక్ డిమాండ్ చేశారు. చిట్యాల పట్టణంలో శనివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీలకు వర్తించే అన్ని సౌకర్యాలు, పథకాలను నాయిబ్రాహ్మణులకు వర్తింపజేయాలని కోరారు. ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సంఘం పట్టణ, మండల అధ్యక్షులు అమరోజు వెంకటేశం, అంశాల శ్రవణ్‌కుమార్, నాయకులు అమరోజు శ్రీరాములు, అమరోజు వెంకన్న, కృష్ణయ్య, వెంకన్న, మహేష్, మత్స్యగిరి పాల్గొన్నారు.

పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి

నార్కట్‌పల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కేసీఆర్‌ను మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శనివారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరంగల్‌లో నిర్వహించే బహిరంగ సభ, పార్టీ రజతోత్సవాల నిర్వహణపై దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించినట్లు చిరుమర్తి పేర్కొన్నారు.

యువకులు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి : సీఐ

కనగల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యువకులు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని చండూరు సీఐ ఆదిరెడ్డి అన్నారు. మిషన్ పరివర్తనలో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కనగల్ గ్రామానికి చెందిన యవకులకు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ ఆదిరెడ్డి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసైతే జీవితంలో సర్వం కోల్పోతారని వివరించారు. వేసవి సెలవులను చక్కగా ఉపయోగించుకుని క్రీడల్లో తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. గొప్ప లక్ష్యాలను ఎంపిక చేసుకుని వాటి సాధించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ విష్ణుమూర్తి, ఏఎస్‌ఐ నర్సింహారెడ్డి, పీసీలు రమేష్‌నాయక్, రవీందర్, వెంకట్, గోపాల్, రాజు, అనంతరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆటల పోటీల్లో పాల్గొన్న తల్లిదండ్రులు

నల్లగొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని జీవిగూడెం రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ లలితకుమారి అన్నారు. పేరెంట్స్ డే సందర్భంగా శనివారం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లలితకుమారి మాట్లాడుతూ ఇలాంటి క్రీడలు నిర్వహించడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఎంతో సంతోషంగా ఉంటారని పేర్కొన్నారు. పాఠశాల వార్షికోత్సవం నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలకు ఏప్రిల్ 2వ తేదీన బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నీరజ, పావని, యశస్విని, ఉపేంద్ర, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న పిట్టల శ్రీనివాస్

నల్లగొండ టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బీసీలలో అత్యధిక జనా భా కలిగి ఉన్న ముదిరాజ్ కులస్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ముదిరాజ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్‌ముదిరాజ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని బీసీ భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్ కులస్థులు అధిక సంఖ్యలో ఉన్నా ఏ రంగంలో ముందంజలో లేకపోవడం విచారకరమని అన్నారు. ఎన్నికల సమ యంలో ముదిరాజ్‌లను బీసీ- డీ నుంచి బీసీ ఏ కి మారుస్తామని హామీ ఇచ్చి వి స్మరించినట్లు తెలిపారు. వెంటనే బీసీఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం అన్ని పార్టీలు టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశబోయిన శంకర్ ముదిరాజ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు గీతా గణేషము దిరాజ్, ప్రధానకార్యదర్శి పిట్టల రామకృష్ణ, మత్స్యకారుల జిల్లా అధ్యక్షుడు చాగంటి రాములుముదిరాజ్, నియోజకవర్గ అధ్యక్షుడు గుడిసె పరశురాములు ముదిరాజ్, తోట నాగరాజు, సైదులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు

నల్లగొండ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా శనివారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ముస్లిం టీచర్లకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. మౌలానా హతీక్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించి ముస్లిం టీచర్ల ఉపవాస దీక్షలను విరమించారు. అనంతరం టీచర్లకు పండ్లు, అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, ఆవాజ్ జిల్లా కార్యదర్శి సయ్యద్ హాషం, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, రాష్ట్ర కోశాధికారి ఎడ్ల సైదులు, సంఘం రాష్ట్ర, జిల్లా, మండలశాఖ బాధ్యులు నర్రా శేఖర్‌రెడ్డి, నర్సింహ, ఖాదర్ అన్సారీ, ఖుషాలోద్దీన్, సయ్యద్, ఇప్తికార్ అలీ, సైదులు, రమణ, రవీందర్, పగిళ్ల సైదులు, భానుప్రకాష్ పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి


మర్రిగూడ: యరగండ్లపల్లిలో ఎండిన పంటను పరిశీలిస్తున్న నాయకులు

కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు మధుసూదన్‌రెడ్డి

నల్లగొండటౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సాగునీటి ఎద్దడి, విద్యుత్ కోతల కారణంగా ఎండిన పంటలకు ప్రభుత్వం వెంటనే తగిన నష్టపరిహారం చెల్లించాలని కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని తాళ్లబావిగూడెం గ్రామంలో శనివారం ఎండిపోయిన వరిపొలాలను పరిశీలించారు. ఎండిపోయిన పొలాలన్నింటికి ఎకరాకు రూ.30వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ టూటౌన్ అధ్యక్షుడు మిర్యాల వెంకటేశం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, ఏమిరెడ్డి బిక్షంరెడ్డి, రమణ ముదిరాజ్, నవీన్‌రెడ్డి, బీపంగి జగ్జీవన్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి, జిల్లా కోశాధికారి కంచర్ల విద్యాసాగర్ రెడ్డి, కటకం శ్రీధర్, శ్రీనివాసరెడ్డి, చంటి, ముకేశ్, వినోద్, మందడి మాధవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

ఎండిన పొలాలను పరిశీలించిన సీపీఎం నాయకులు

● మర్రిగూడ: ఎండిన పంట పొలాలకు ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎండిపోయిన వరి పంటలను శనివారం సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 300ఎకరాలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు దశరథ, శ్రీను, రామలింగాచారి పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల కోసం పాట్లు


తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ వద్ద బారులుదీరిన దరఖాస్తుదారులు

నల్లగొండరూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకా నికి దరఖాస్తు చేసుకోవాలని యువకులు, ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు. ఈ నేపథ్యంలో దరఖాస్తు చేసుకునేందుకు కా వాల్సిన పత్రాల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. దరఖాస్తుల కోసం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఒక్కసారిగా ప్రజలు తహసీల్దార్ కా ర్యాలయానికి బారులు దీరుతున్నారు. దీంతో కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ పరిశీలన కోసం పట్టణంలో ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చారు. ప్రభు త్వం నిరుద్యోగ యువతీ, యువకులు, చిరువ్యాపారాల కోసం రాజీవ్ యువవికాసం పథకాన్ని ప్రా రంభించింది. ఈ పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉపాధి కల్పించనున్నది. ఇందులో 60 నుంచి 80 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నారు. ఈ పథకం మార్చి 15 నుంచి, ఏప్రిల్ 4వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం ఉంది. ఏప్రిల్ 6 నుంచి మే 31వ తేదీ వరకు దరఖాస్తులు పరిశీలించి, జూన్ 2వ తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అర్హులైన వారికి మంజూరు పత్రాలను అందజేయనున్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి తీసుకోవాల్సిన ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ప్రభుత్వంపై పెరుగుతున్న ప్రజా వ్యతిరేకత: బీజేపీ

మునుగోడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. మునుగోడులో శనివారం నిర్వహించిన పార్టీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏదీఐనా అమలు చేయకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత రోజురోజుకు పెరుగుతోందని అన్నారు. గ్రామాల్లో రైతులు, మహిళలు, నిరుద్యోగులతో పాటు వివిధ వర్గాల ప్రజలు తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని అన్నారు.

సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్యయాదవ్, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, జిల్లా కార్యదర్శి బొడిగె అశోక్‌గౌడ్, నాయకులు భవనం మధుసూదన్ రెడ్డి, ముంగి ధనుంజయ, నరేందర్‌గౌడ్, బిక్షం, సైదులు, లింగయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల అందజేత

నాంపల్లి: కల్యాణలక్ష్మి పథకం పేదలకు ఒక వరమని తహసీల్దార్ దేవాసింగ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 86 మందికి ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన శనివారం లబ్ధిదారులకు అందజేశారు.

పలువురికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నార్కట్‌పల్లి: మండలంలోని బాగిగూడెం, నల్లోనిగూడెం, బెండల్‌పహాడ్‌లలో ఇటీవల మృతి చెందిన పార్టీ కార్యకర్త, ప్రమాదాల్లో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న బాధితుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శనివారం పరామర్శించారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కనగల్: మండలంలోని దోరెపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు సీహెచ్ అశోక్ శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఐతగోని యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ గ్రామంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో దేవిరెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.

అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నకిరేకల్: అసంఘటితరంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వంటెపాక వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. చలో హైదరాబాద్‌కు వెళ్తున్న అసంఘటిత రంగ కార్మికుల అక్రమ అరెస్టును నిరసిస్తూ మెయిన్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్మికులు హైదరాబాద్ వెళ్లకుండా పోలీసులు నిర్బంధించడం నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నాయకులు తాడ్వాయి రాములు, సూరారపు వీరయ్య, సైదులు పాల్గొన్నారు.

గ్యాస్ అక్రమంగా తరలిస్తే ఉపేక్షించేది లేదు

మర్రిగూడ: గ్యాస్ అక్రమంగా తరలిస్తే ఉపేక్షించేది లేదని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ అన్నారు. గ్యాస్ వినియోగదారుల వద్ద అదనంగా ఒక్క రూపాయి తీసుకున్నా సదరు గ్యాస్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పరిశీలన

నాంపల్లి: మండలంలోని మహ్మదాపురం గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి అనువైన భూమిని చండూరు ఆర్డీవో శ్రీదేవి శనివారం సర్వేనెంబర్ 6లో గల భూమిని పరిశీలించారు.

ఆచార్య లక్ష్మణమూర్తి కన్నుమూత

- తెలుగు, సంస్కృత, ఆంగ్ల భాషల్లో పండితుడు
- నేడు పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు

హైదరాబాద్ సిటీ, మార్చి22(ఆంధ్రజ్యోతి): కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆంగ్ల ఆచార్యుడు, తెలుగు, సంస్కృత భాషల్లో పండితుడు పెరంబుదూరు లక్ష్మణమూర్తి (86) ఇకలేరు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన లక్ష్మణమూర్తి కాకతీయ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఆంగ్లం మీద సాధికారత కలిగిన లక్ష్మణమూర్తి తెలుగు, సంస్కృతభాషల్లోనూ పండితుడు. సంస్కృతాంధ్ర భాషావేత్త కండ్లకుంట అళహ సింగరాచార్యులు వద్ద వ్యాకరణం అభ్యసించారు. ఆయన రచనలు 'గోపికావల్లభ', 'సమర్పణ' పద్యకావ్యాలతో పాటు 'ఉపనిషత్తులు', 'దేహళి' వ్యాస సంపుటి తదితర పుస్తకాలు వెలువడ్డాయి. లక్ష్మణమూర్తి భార్య తిరునగరి జయశ్రీ వరంగల్ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకురాలిగా పనిచేశారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. ఆయన అంత్యక్రియలు ఆదివారం ఉదయం 11 గంటలకు పంజాగుట్ట శ్మశానవాటికలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి


కూలీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో జ్యోతిలక్ష్మి

శాలిగౌరారం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నీటిని సంరక్షించుకోవాలని, పొదుపుగా, పద్ధతిగా వాడుకోవాలని ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా మండలంలోని అడ్లూర్ గ్రామ శివారులో శనివారం ఉపాధిహామీ కూలీలతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రాణకోటి మనుగడకు నీరు ఎంతో ముఖ్యమ ని ప్రతి నీటిబొట్టు సద్వినియోగం చేసుకోవాలని, వృథా చేయవద్దని కోరారు. అనంత రం గ్రామ శివారులో నిర్వహిస్తున్న ఫీడర్ ఛానల్, పాంపాండ్ దగ్గర పనిచేస్తున్న కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చింత నరేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత తదితరులు పాల్గొన్నారు.


మర్రిగూడ: మండలంలోని దామెర బీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో జల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉదావత్ లచ్చిరాం మాట్లాడుతూ నీటి ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలిపారు. భూగర్భ జలాల పెంపునకు ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుల, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించాలి

కనగల్, మా ర్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకుని ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు కృ షి చేయాలని డీఏపీసీయూ డీటీఎం సుధాకర్ కోరారు. దర్వేశిపురం గ్రామంలో శనివారం లైఫ్ సీబీవో ఆధ్వర్యంలో మిషన్ 95 కింద సుమారు వంద మంది స్థానికులకు హెచ్‌ఐవీ టెస్టులను నిర్వహించారు. అనంతరం ఎయిడ్స్ గురించి వివరించారు. నివారణ ఒక్కటే మార్గమని సూచించారు. కా ర్యక్రమంలో డీఏపీసీయూ జిల్లా సూపర్‌వైజర్ సంపత్, లైఫ్ సీబీవో నందిని, ఓఆర్ లు అలివేలు, పద్మ, నాగు, లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యం

- నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మంజుల


సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న గుత్తా మంజుల

కేతేపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధ్యామిస్తుందని నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్తా మంజులమాధవరెడ్డి అన్నారు. మండలంలోని కొర్లపహాడ్, కేతేపల్లి గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణ పనులకు ఆమె శనివారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పాలకులు గ్రామీణ ప్రాంతాలపై వ్యవహరించిన నిర్లక్ష్యం వల్ల గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సమస్యలను పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేసేలా చూడాలని ఆమె అధికారులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, మార్కెట్ డైరెక్టర్లు ఎస్‌కె.లతీఫ్, బయ్య ముత్తయ్య, పరశురాములు, కాంగ్రెస్ నాయకులు బొజ్జ సుందర్, మట్టి సాల్మన్, జె.వెంకటనర్సయ్యయాదవ్, బీరం జాన్‌రెడ్డి, జె.ముత్తమ్మ, ఎన్.మంగమ్మ, ఎ.వీరాచారి, ఎ.వెంకట్‌గౌడ్, ఆంధ్రయ్య, బి.రవి, ఎన్.కిరణ్, రమేష్, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
ఆదివారం 23 మార్చి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.95	140	170
నల్లగొండ	రూ.100	145	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 కనిష్ఠం 19.0

వాట్సప్‌లో ప్రశ్నపత్రం ఎవరికోసం..?

- పూర్తిస్థాయి విచారణ చేపట్టిన అధికారులు
- ఇన్విజిలేటర్ సస్పెన్షన్
- విధుల నుంచి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి తొలగింపు
- పూర్తిస్థాయి విచారణకు ఆదేశించిన కలెక్టర్ ఇలాత్రిపాఠి



నల్లగొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పదో తరగతి తెలుగు-1 ప్రశ్నపత్రం వాట్సప్ గ్రూపుల్లో ప్రత్యక్షమైన ఘటనపై ప్రభుత్వం విచారణ నిర్వహిస్తోంది. ప్రశ్నపత్రం నకిరేకల్ ఎస్సీ గురుకుల విద్యాలయం పరీక్షా కేంద్రం నుంచే లీక్ అయిందని నిర్ధారణకు వచ్చిన విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రశ్నాపత్రం ఫొటో తీశారని భావించిన విద్యార్థినిని డీబార్ చేశారు. ఆ పరీక్ష హాల్ ఇన్విజిలేటర్ సుధారాణిని సస్పెండ్ చేయగా, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ గోపాల్, డిపార్ట్‌మెంటల్ అధికారి రామ్మోహన్‌రెడ్డిని విధుల నుంచి తొలగించారు. మొత్తం ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టారు. నకిరేకల్ సర్కిల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తుండగా, విద్య, రెవెన్యూ, పోలీసుశాఖల ద్వారా సంయుక్త విచారణ కొనసాగుతోంది. వాట్సప్‌లో ప్రశ్నాపత్రం వెలువడటాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం ఒకవైపు వదంతులు వ్యాప్తి చేయవద్దని హెచ్చరిస్తూ, మరోవైపు ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఆదేశించగా, కలెక్టర్ ఇలాత్రిపాఠి విచారణకు ఆదేశించారు. మరోవైపు పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఆమె ఎస్పీ శరత్‌చంద్రపవార్‌తో కలిసి పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. విద్య, రెవెన్యూ, పోలీస్ అధికారుల నుంచి ప్రాథమిక సమాచారం సేకరించారు.

ఎవరి కోసం, ఎవరు చేశారనే కోణంలో దర్యాప్తు..

వాట్సప్‌లో ప్రశ్నపత్రం వెలుగుచూసిన ఘటనలో కీలకమైన అంశాలపై పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆరా...

- మిగతా 7వ పేజీలో...



వెనుకబడిన విద్యార్థుల కోసం ఏఐతో బోధన

- తెలుగు, గణిత అభ్యాసాలపై సులువైన పద్ధతిలో బోధన
- ఉమ్మడి జిల్లాలో పలు పాఠశాలల్లో అమలు

విద్యార్థుల్లో పలువురు మౌలిక భాష, సంఖ్యాజ్ఞానం అభ్యాసనతో పాటు గణితంలో చతుర్విధ ప్రక్రియల్లోనూ ఆశించిన స్థాయి సామర్థ్యాలు కనిపించడం లేదు. దీంతో విద్యాభ్యాసంలో వెనకబడుతున్నారు. వీరికోసం విద్యాశాఖ పలు రకాల కార్యక్రమాలు అమలు చేస్తున్నా సత్ఫలితాలు రావడం లేదు. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధ సాయంతో విద్యార్థుల్లో మెరుగైన సామర్థ్యాల సాధన కోసం ప్రత్యేక చర్య లు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల్లో విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి విడతల వారీగా ఏఐ ద్వారా పాఠాలు అందిస్తున్నారు. వారికి తెలుగు, గణిత అభ్యాసాలపై తరగతులు ఏర్పాటుచేశారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా విద్యార్థులను ఆకట్టుకునేలా ఏఐ బోధన చేస్తున్నారు.

ఐదుగురితో బ్యాచ్, 20 నిమిషాల క్లాస్

పాఠశాలల్లో అందుబాటులో ఉన్న కంప్యూటర్లను బట్టి ఒక్కో కంప్యూటర్‌కు ఒక విద్యార్థిని ఎంపిక చేశారు. సూర్యాపేట జిల్లాలో ఐదుగురిని ఒక బ్యాచ్‌గా ఏర్పాటు చేసి ఒక్కో బ్యాచ్‌కు తెలుగు వాచకం, గణిత అభ్యాసాలపై 20 నిమిషాల వ్యవధిలో ఏఐ పాఠాలు బోధిస్తున్నారు. పాఠాలను సంబంధిత విద్యార్థి అర్థం చేసుకున్నాడా లేడా అనేది ఏఐ గుర్తించి అర్థం కాకపోతే అతడికి అర్థమయ్యే రీతిలో సరళమైన పద్ధతిలో బోధిస్తుంది. అర్థమైతే మరికొంత మెరుగైన పద్ధతిలో బోధిస్తుంది.

- మిగతా 7వ పేజీలో...



కంప్యూటర్ల ద్వారా ఏఐ పాఠాలు వింటున్న విద్యార్థులు

యాదాద్రి భువనగిరి జిల్లాలో..

మొత్తం ఏడు మండలాల్లోని 9 పాఠశాలల్లో ఏఐ పాఠాలు బోధిస్తున్నారు. చౌటుప్పల్ మండలంలో జైకేసారం, దేవలమ్మనాగారం, భువనగిరి మండలంలో తుక్కాపూర్, మోటకొండూరు మండలంలో ముత్తిరెడ్డిగూడెం, ఆలేరు మండలంలో కొల్లూరు,రామన్నపేట మండలంలో ఇంద్రపాలనగరం, యాదగిరిగుట్టమండలంలో పెద్దకందుకూరు, చొల్లేరు, బీబీనగర్ మండలంలో జమీలాపేట గ్రామాల్లోని పాఠశాలల్లో అమలు చేస్తున్నారు.

సూర్యాపేట జిల్లాలో..

గరిడేపల్లి మండలంలోని వెల్దండ, రాయినిగూడెం,గానుగబండ,సూర్యాపేట మండలంలో ఇమాంపేట, చివ్వెంల మండలంలో వట్టిఖమ్మంపహాడ్, హుజూర్‌నగర్ మండలంలో బూరుగడ్డ, మోతె మండంలో ఉంద్రుగొండ, నేరేడుచర్ల మండలంలో చింతకుంట్ల, మఠంపల్లి మండలంలో వరదాపురం, చింతలపాలెం మండలంలో తమ్మవరం, నడిగూడెం మండలంలో వల్లాపురం, మద్దిరాల మండలంలో రెడ్డిగూడెం, తిరుమలగిరి మండలంలో తొండ గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఏఐ పాఠాలు బోధిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతానికి 130మంది విద్యార్థులకు ఏఐ పాఠాలు బోధిస్తున్నారు.

నల్లగొండ జిల్లాలో...

జిల్లాలోని 10 మండలాల్లో 14 పాఠశాలల్లో ఏఐ పాఠాలు అందిస్తున్నారు. అనుముల మండలంలో హాలియా, కొత్తపల్లి, చిట్యాల మండలంలో నేరెడ, దామరచర్ల మండలంలో కల్లేపల్లి, దేవరకొండ మండలంలో ఇద్దంపల్లి, కేతేపల్లి మండలంలో తుంగతుర్తి, కొప్పోలు, మిర్యాలగూడ మండలంలో అన్నారం, మునుగోడు మండలంలో కొరటికల్, నల్లగొండ మండలంలో కంచనపల్లి, శాలిగౌరారం మండలంలో బైరవునిబండ, వేములపల్లి మండలంలో ఆమనగల్ పాఠశాలల్లో ఏఐ తరగతులు నిర్వహిస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:34 (ఆదివారం సాయంత్రం)
సహర్: 4:55 (సోమవారం ఉదయం)

ఫ్లైఓవర్‌లను నిర్మించి ప్రమాదాలు నివారించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి



పాదయాత్రను ప్రారంభిస్తున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై ఫ్లైఓవర్ వంతెనలను నిర్మించి ప్రమాదాలు నివారించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం సీపీఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టాలని కోరుతూ రామచంద్రగూడెం వైజంక్షన్ నుంచి బైపాస్ మీదుగా నందిపాడు క్రాస్‌రోడ్, టాకారోడ్డు, రాజీవ్‌చౌక్ మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి డివిజనల్ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణం విస్తరించి బైపాస్‌కు అవతలివైపు జనావాసాలు పెరిగాయన్నారు. నిత్యం వందలాది మంది ప్రజలు విద్య, వ్యాపారం, అనేక రకాల పనులపై బైపాస్‌పై క్రాస్‌రోడ్ల వద్ద అటుఇటు రాకపోకలు చేస్తుంటారన్నారు. వేగంగా వెళ్లే వాహనాలతో తరుచూ ప్రమాదాలు జరుగుతూ, ప్రాణనష్టం సంభవిస్తుందన్నారు. బైపాస్‌పై వైజంక్షన్, నందిపాడు, చింతపల్లి, ఈదులగూడ క్రాసింగ్‌ల వద్ద ఫ్లైఓవర్ వంతెనలు నిర్మించాలన్నారు. బైపాస్‌పై 4 అండర్‌పాస్‌లను నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, సంబంధిత మంత్రి గత ఆరు నెలల క్రితం భూమి పూజ చేశారని తెలిపారు. నేటివరకు అండర్‌పాస్‌ల నిర్మాణపనులు ప్రారంభానికి నోచలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరుచేసి అండర్‌పాస్‌లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీశ్ చంద్ర, సత్యనారాయణరావు, గాదె పద్మ, రవినాయక్, మల్లుగౌతంరెడ్డి, మంగారెడ్డి, శశిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, రెమిడాల పరుశరాములు, వరలక్ష్మి, చౌగాని సీతారాములు, అయూబ్, అంజద్, అరుణ పాల్గొన్నారు.

బరిలో దించేందుకు సిద్ధం కావాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి



మహాసభలో మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

దేవరకొండ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ నుంచి బరిలో నిలిచేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంకావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పల్లా నర్సింహారెడ్డి కోరారు. శనివారం దేవరకొండ మండలం పడ్మట్‌పల్లిలో జరిగిన గ్రామశాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా అత్యధిక స్థానాల్లో పోటీచేసి సత్తాచాటాలన్నారు. ప్రజా సమస్యలపై సీపీఐ ప్రజలపక్షాన నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఎస్ఎల్‌బీసీ, డిండి, పెండ్లిపాకల ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కిన్నెర యాదయ్య, మండల సీపీఐ కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, వలమాల ఆంజనేయులు, పల్లా రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయడమే ధ్యేయం

- ఐక్యత చాటడమే నా పని
- టీపీసీసీ మాజీ నేత కుందూరు జానారెడ్డి
- ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు ఘనస్వాగతం



జానారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎంపీ రఘువీర్‌రెడ్డిలకు పూలమాల వేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే ధ్యేయమని టీపీసీసీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. మిర్యాలగూడలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ స్వాగత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి జిల్లా అందులో మిర్యాలగూడ నియోజకవర్గం రాష్ట్రానికిశక్తి లాంటిదన్నారు. సామాన్య కార్యకర్తగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన శంకర్‌నాయక్ ఎమ్మెల్సీగా ఎన్నికవ్వడం సంతోషకరమన్నారు. ఒక గిరిజన బిడ్డను ఎమ్మెల్సీగా చేయడం ఇదే ప్రథమమన్నారు.ఇక బడా, చోటా నేతలను, నాయకులు, కార్యకర్తలను ఐక్యతగా ఉంచుతూ పార్టీని బలోపేతం చేయడమే తన పని అన్నారు.

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం: ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

సామాజిక న్యాయం ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. తొలిసారిగా నియోజకవర్గానికి వచ్చిన శంకర్‌నాయక్‌కు కార్యకర్తలు స్వాగతం పలికారు. గిరిజన నృత్యాలు, పూలు, గజమాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుందూరు జానారెడ్డి తండ్రి సమానులని అన్నారు. ఎమ్మెల్సీగా తనను ఎంపిక చేసిన పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేస్తానని, అందరినీ సమన్వయపరుస్తూ నియోజకవర్గం, జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

కష్టానికి తగిన ఫలితముంటుంది : ఎంపీ

కష్టానికి తగిన ఫలితం ఎప్పటికైనా ఉంటుందని ఎంపీ రఘువీర్‌రెడ్డి అన్నారు. చిన్నతనం నుంచే పార్టీ, ప్రజల కోసం పనిచేసిన శంకర్‌నాయక్‌ను ఎమ్మెల్సీగా చేయడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, నూకల వేణుగోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ, తలకొప్పుల సైదులు, పొదిల శ్రీను, స్కైలాబ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు నీటి ఎద్దడి రాకుండా చేద్దాం

జిల్లా భూగర్భ జల శాఖాధికారి రేవతి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా భూగర్భజలశాఖాధికారి రేవతి

నార్కట్‌పల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నీటిని ఒడిసిపట్టి భూగర్భంలోకి ఇంకింపజేయడం ద్వారా భావితరాలకు నీటి ఎద్దడి లేకుండా చేద్దామని జిల్లా భూగర్భజల శాఖ అధికారి రేవతి అన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని నెమ్మాని రైతువేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. భూగర్భజలాల సంరక్షణ, వర్షపు నీటిని ఏవిధంగా భూమిలోకి ఇంకింపజేయాలో రైతులకు వివరించారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి అనంతరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఆరుతడి పంటలు, బిందు, తుంపరసేద్యంతో జరిగే లాభాల గురించి అవగాహన కల్పించారు. సదస్సులో మండల ప్రత్యేకాధికారి చరిత, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో కత్తురోజు ఉమేశ్ చారి, ఏవో కే.గౌతమ్, మండల ఉద్యానవనాధికారి శ్వేత, ఆర్.మానస, అసిస్టెంట్ హైడ్రాజియాలజిస్టులు కే.రజని, ఎన్.కుమార్, జియోఫిజిస్టు లక్ష్మయ్య, సూపరింటెండెంట్ రాకేశ్‌రెడ్డి, ఆదర్శ రైతులు కే.జనార్ధన్‌రెడ్డి, కే.సత్తిరెడ్డి, జావేద్, నర్సింహ, మహేశ్, యాదగిరి పాల్గొన్నారు.

మిస్ వరల్డ్ పోటీదారులకు ఏర్పాట్లు చేయాలి

- పర్యాటకశాఖ ఎండీ ప్రకాష్‌రెడ్డి
- నాగార్జునసాగర్‌లో కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో సమీక్ష



బుద్ధవనంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న పర్యాటక శాఖ ఎండీ ప్రకాష్‌రెడ్డి

7

క్షుణ్ణంగా తనిఖీ చేయాలి: కలెక్టర్



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ఇలాత్రిపాఠి , ఎస్పీ శరత్‌చంద్ర పవార్

హాలియా, మార్చి22(ఆంధ్రజ్యోతి): విద్యార్థును క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం హాలియాలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ శరత్‌చంద్రపవార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. వారివెంట సీఐ జనార్ధన్ గౌడ్, మండల విద్యాధికారి గుండా కృష్ణమూర్తి, సీఎస్ చిన్న నారాయణరెడ్డి, డీవో గవ్వ హిమవంతరెడ్డి, ఎస్ఐ సతీష్‌రెడ్డి ఉన్నారు.

డెడ్ స్టోరేజీకి బీ.వెల్లెంల రిజర్వాయర్ సామర్థ్యం

- 296 నుంచి 290 మీటర్లకు చేరిన నీటి మట్టం

నార్కట్‌పల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేసవి కారణంగా ఎగువ నుంచి నీటి విడుదల లేకపోవడంతో నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టు రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరింది. దీంతో రెండు రోజులుగా రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల నుంచి నీటి విడుదల నిలిచిపోయింది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం (0.302 టీఎంసీలు) 296 మీటర్లు కాగా ప్రస్తుతం 290మీటర్లకు చేరుకుంది. దీంతో రిజర్వాయర్ నుంచి మొన్నటి వరకు కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటి విడుదల చేయగా పరిసర గ్రామాల్లోని చెర్వులు నిండాయి. ప్రస్తుతం నీటినిల్వలు తగ్గడంతో సరఫరా కూడా నిలిచిపోయింది.

ఎండల్ కాకుండా ఉంటాం

- మండుటెండలో ట్రాఫిక్ పోలీసుల తిప్పలు
- విధుల్లో 50 మంది అధికారులు, సిబ్బంది
- సమ్మర్ కిట్స్, శీతల పానియాలతో ఉపశమనం

6

ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు ఘన స్వాగతం


వేములపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ఎన్నికైన కేతావత్ శంకర్‌నాయక్ తొలిసారిగా ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో వేములపల్లికివచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మం డలాధ్యక్షుడు మాలి కాంతారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి పూల మాల, శాలువాలతో సన్మానించి ర్యాలీ నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా,మార్చి22(ఆంధ్రజ్యోతి): హాలియా టౌన్ వన్ ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏ ఈ ధన్‌రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బొడ్రాయి బజార్, రెడ్డికాలనీ, అంగిబజార్, వీరయ్యనగర్, సాయిప్రతాప్‌నగర్, ఎమ్మెల్యే వెంచర్, ఆరు షీ వెంచర్, చర్చి బ్యాక్‌సైడ్ వెంచర్, ఎస్‌బీఐ పరిధిలో సరఫరా ఉండదన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

● గుర్రం వెంకటేశం, ఎంపీడీవో, నిడమనూరు



ఇంటర్వ్యూ Interview

మండలంలోని గ్రామాల్లో వేసవి సీజన్‌లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో గుర్రం వెంకటేశం అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పంచాయతీ కార్యదర్శుల పనితీరు తదితర అంశాల గురించి ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. (నిడమనూరు, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంపీడీవో: పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత ఇంజనీర్లతో ఇటీవల సమీక్షా సమావేశం నిర్వహించం. కేవలం తాగునీటి సమస్యే కాకుండా ఇతర ప్రజా సమస్యలపై పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో తాగునీటి బోర్లు కాలిపోతున్నాయి కదా?

ఎంపీడీవో: కాలిపోతున్న బోర్లను సకాలంలో మరమ్మతులు చేయిస్తున్నాం. ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నీటిని సక్రమంగా సరఫరా చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మిషన్ భగీరథ నీటి సరఫరా ఎలా ఉంది?

ఎంపీడీవో: మిషన్ భగీరథ నీటి సరఫరాలో చిన్నచిన్న సమస్యలు ఉన్నట్లు తెలిసింది. వాటిని అధిగమించేందుకు ప్రయత్నం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పంచాయతీ కార్యదర్శుల కొరత ఉందా?

ఎంపీడీవో: మండలంలో 29 గ్రామ పంచాయతీలకు 27 మంది కార్యదర్శులు ఉన్నారు. నిడమనూరు, బొక్కమంతలపహడ్ గ్రామాల్లో ఇన్‌చార్జి కార్యదర్శులను నియమించాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం గురించి చెప్పండి ?

ఎంపీడీవో: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తుమ్మడం గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేశాం. 260 మంది లబ్ధిదారులను గుర్తించాం. కొన్ని ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోశాం. నిర్మాణాలను వేగవంతం చేస్తాం.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



వీ.టి.నగర్ కొండపై సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

చింతపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుకొండ్ల(వీ.టీనగర్)కొండపై వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సుదర్శన హోమం, సామూహిక సత్యనారాయణవ్రతం కనుల పండువగా చేశారు. అర్చకుల వేదమంత్రాలచే మహాపూర్ణాహుతి నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ ఛైర్మన్ పూరె లక్ష్మణ్, ధర్మకర్తలు, మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్, మాస భాస్కర్ మంజుల, అంగిరేకుల గోపాల్, పాల్గొన్నారు.

మందకృష్ణ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ



మందకృష్ణమాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దవూర, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మందకృష్ణ మాదిగ సుదీర్ఘకాలం రాజీలేని పోరాటాల వల్ల అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు పులిమాల కృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందడం వల్ల 30 ఏళ్ల మాదిగల కల నెరవేరిందన్నారు. కార్యక్రమంలో కుక్కమూడి ముత్యాలు, మల్లేపల్లి నరేందర్, తరి పెద్దనాగయ్య, విద్యాసాగర్, దున్న వెంకటేశ్వర్లు, చిలుముల వెంకన్న, తరి శ్రీనివాస్, జిల్లా సుమన్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు చల్లని నీరు ఏర్పాటు

హాలియా, మార్చి22 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో హాలియాలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద చల్లని తాగు నీరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అనుముల మండలాధ్యక్షుడు పాంపాటి పాండరయ్య మాట్లాడుతూ అన్ని పరీక్షలు పూర్తిఅయ్యేంత వరకు విద్యార్థులకు చల్లని నీరు ఏర్పాటు చేసామని అదే విధంగా పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఉపకార వేతనాలను కూడా అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి వాసుదేవుల పుల్లారెడ్డి, ట్రెజరర్ తుమ్మురుగోటి రామలింగయ్య, ఉపాధ్యాయులు వెంకట్‌రాంరెడ్డి, అరవింద్ కువార్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి



దేవరకొండ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో

దేవరకొండ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి సూచించారు. దేవరకొండ పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల, కృష్ణవేణి పాఠశాల సెంటర్లను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పలు సూచనలు చేశారు. ఆయన వెంట దేవరకొండ ఎంఈవో మాత్యనాయక్, ఆర్‌ఐ ముబిన్,ఉన్నారు.

అడవిదేవులపల్లి, : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. రెండో రోజు శనివారం నిర్వహించి పరీక్షకు మొత్తం 95 మంది విద్యార్థులకు అందరూ హాజరైనట్లు ఎంఈవో వరలక్ష్మి తెలిపారు శనివారం పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్‌ఐ శేఖర్‌లు సందర్శించి పరిశీలించినట్లు తెలిపారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



చింతపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలం వెంకటేశ్వరనగర్‌లో డ్రైనేజీలో చెత్తాచెదారంతో పాటు మురుగు నీరు పేరుకుపోవడంతో స్థానికులు మ్యాన్‌హోల్స్ మూత తీసి డ్రైనేజీని తొలగించారు. మూత ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదం పొంచి ఉన్నది. తొలిగించిన మూతను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇరుకు గదుల్లో వ్యవసాయ కార్యాలయం

● ఏళ్ల తరబడిగా మార్కెట్ యార్డులో నిర్వహణ ● ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, రైతులు

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు నిత్యం తమ పంటలకు సంబంధించిన సమస్యలపై, ప్రభుత్వం అమలు చేస్తు న్న పథకాలు తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ కార్యాలయానికి వస్తుంటారు. కానీ గదులుచిన్నవిగా ఉండటంతో రైతులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక సీజన్‌లో వస్తే బయట నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయం అనువుగా లేకపోవడంతో సమావేశాలు, సదస్సులు రైతువేదికలో నిర్వహిస్తున్నారు. (ఆంధ్రజ్యోతి -నిడమనూరు)



నిడమనూరు వ్యవసాయ కార్యాలయం



శిథిలావస్థకు చేరిన గదులు

మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ(ఏవో) కార్యా లయానికి సొంత భవనం లేక వ్యవసాయ శాఖ సిబ్బందితో పాటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పశు వైద్యశాల కోసం నిర్మించిన ఓ రెండు చిన్న ఇరుకు గదుల్లో ఏవో కార్యాలయాన్ని మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. ఏళ్ల తరబడి మార్కెట్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారే కానీ ఏవో కార్యాలయానికి పక్కా భవనం నిర్మించాలనే ఆలోచన అధికారులు, ప్రజాప్రతినిధులకు మాత్రం రావడం లేదని రైతులు వాపోతున్నారు. గతంలో కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ స్థలం లేదనే కారణంతో రద్దు చేశారు. ప్రభుత్వ స్థలం కొరత కారణంగా పలు ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు మంజూరు కావడం లేదు.

ఏవో కార్యాలయాన్ని రెండు చిన్న చిన్న ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నందున కార్యాలయ సిబ్బందికే గదులు చాలడం లేదు. సిబ్బందితో పాటు రైతులతో నిత్యం కార్యాలయం రద్దీగా ఉంటుంది. కానీ కార్యాలయం లో కనీస సౌకర్యాలు కూడా లేవు. తాగునీటి వసతి, మూత్రశాలల సదుపాయాలు కనిపించవు. శిథిలావస్థకు చేరిన భవనంలా ఉంటుంది. చెదలు పట్టడంతో కిటికీలు, దర్వాజలు, తలుపులు తొలగించారు. పాముల భయంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా మండల కేంద్రంలో వ్యవసాయ కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరతున్నారు.

పక్కా భవనం నిర్మించాలి



నిడమనూరు మండల కేంద్రంలో వ్యవసాయ కార్యాలయానికి సొంత భవనం లేనందున ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిత్యం రైతులతో రద్దీగా ఉండే కార్యాలయాన్ని చిన్న గదుల్లో నిర్వహించడం బాధాకరం. ప్రభుత్వం సత్వరమే నిధులు మంజూరు చేసి కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి.

ఉన్నం ఈశ్వర్, నిడమనూరు

ఉన్నతాధికారులకు వివరించాం



మండల కేంద్రంలో వ్యవసాయ కార్యాలయానికి సొంత భవనం లేనందున మొదటి నుంచి మార్కెట్ కార్యాలయంలో నిర్వహిస్తున్నాం. చిన్నచిన్న గదులే కావడంతో నిర్వహణకు అంత అనువుగా లేదు. ఇబ్బందుల దృష్ట్యా కార్యాలయానికి పక్కా భవనం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించడం జరిగింది.

- మునికృష్ణయ్య, మండల వ్యవసాయ అధికారి, నిడమనూరు

ఏనెమీదితండా వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనునాయక్

పెద్దవూర, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనే మీదితండాకు చెందిన రమావత్ శ్రీనునాయక్ రాథోడ్ గౌరవ డాక్టరేట్‌ను అందుకు న్నారు. రాష్ట్రంలో నర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై తండాకు చెందిన శ్రీను నాయక్ రాథోడ్ జాతీయ స్థాయిలో ఆర్గనైజేషన్‌ను ఏర్పాటు చేసి కొన్నేళ్లుగా పోరాటాలు నిర్వహిస్తున్నారు. ఆయన కృషి ఫలితంగా నర్సింగ్ ఉద్యోగులకు మిగతా ఉద్యోగుల మాదిరిగా ఆఫీసర్ హోదా కల్పించడంలో విశేష కృషి చేశారు. నర్సింగ్ ఉద్యోగులకు చేసిన కృషిని గుర్తించి న్యూఢిల్లీకి చెదిన గౌరవ డాక్టరేట్ అందించి సన్మానించారు.

బీఆర్‌ఎస్‌వీ నాయకుల ముందస్తు అరెస్ట్

తిరుమలగిరి(సాగర్), మార్చి 22(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్‌కు వెళ్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులను శనివారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌వీ మండల నాయకులు దుబ్బ కోటేష్, మారుపాక కాశీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలన్నారు. అరెస్ట్ అయిన వారిలో కందుకూరి శివ, పెరిక వంశీలు ఉన్నారు.

నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలి

● డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి ●ముదిగొండలో వాటర్‌షెడ్‌పై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న డీపీఆర్‌వో శేఖర్‌రెడ్డి

దేవరకొండ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వర్షపునీరు వృథాకాకుండా నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. వాటర్‌షెడ్ యాత్రలో భాగంగా మండలంలోని ముదిగొండలో గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వ హించారు. వాటర్‌షెడ్లపై రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు ఇంకుడుగుంతలు, వాటర్‌షెడ్లు నిర్మించి నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కృషి సించాయి యోచన పథకం ద్వారా నీటి నిల్వలు, వాటర్‌షెడ్లపై అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు తెలిపారు. వర్షపునీరు వృథాగా పోకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని సంరక్షించుకోవాలన్నారు. చెరువులు, కుంటలు, వాటర్‌షెడ్డుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని, నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచి ంచారు. సమావేశంలో డీఆర్‌డీవో అధికారి శారద, దేవరకొండ ఎంపీడీవో డానియేల్ , ఏవో రవికుమార్, మత్స్యశాఖ అధికారి మారయ్య, వివిధ శాఖల అధికారులు, రైతులు, కళాకారులు పాల్గొని వాటర్‌షెడ్‌లు, నీటి నిలువలపై అవగాహన కల్పించారు.

దుమ్ములేపుతున్న రోడ్డు

● డస్టు వేసి నీళ్లు కొట్టకుండా వదిలేసిన కాంట్రాక్టర్ ● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



గుర్రంపోడు కొప్పోలు గ్రామాల మధ్య లేస్తున్న దుమ్ము

గుర్రంపోడు,ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం నుంచి కొండ మల్లేపల్లి వరకు రెండు నెలల క్రితం రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు. రోడ్డు పూర్తిగా ధ్వంసమైన చోట పాత రోడ్డును పూర్తిగా తొలగించి కొత్తగా కంకర, డస్ట్ వేసి చదును చేస్తున్నారు. అయితే దుమ్ము రాకుండా ఉదయం, సాయంత్రం నీళ్లు కొట్టి చదును చేయాల్సి ఉంది. కానీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నీళ్లు కొట్టకపోవడంతో దుమ్ము లేస్తోంది. గుర్రంపోడు, కొప్పోలు సమీపంలో పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో వస్తున్న దుమ్ముకు ఎదుటి వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. అంతే కాకుండా రోడ్డు మరమ్మతులు చేసేటప్పుడు కనీసం సూచిక బోర్డులు కాంట్రాక్టర్ ఏర్పాటు చేయడం లేదని ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు జరుగుతున్న చోట నిత్యం నీళ్లు కొట్టి చదును చేసి దుమ్ము రాకుండా చూడాలని, ఎక్కడికక్కడ సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్ బీ ఏఈ అనిత వివరణ కోరగా వారం రోజుల్లో పనులు పూర్తి అవుతాయని తెలిపారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ప్రయాణికుడు రోడ్డుకు మరమ్మతు పనులు జరిగే చోట సూచిక బోర్డులు ఏర్పాటు చే యాలి. పెద్ద వాహనాలు వెళ్తున్న సమయంలో బైకుపై వెళ్తుంటే ఆ దుమ్ముకి ఏమీ కనిపించట్లేదు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో పనుల్లో నాణ్యతాలోపం కూడా కనిపిస్తుంది. అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయించి, రోజు నీటితో చదును చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి

-యాగంటి నారాయణ, గుర్రంపోడు

మోస్తరు వర్షం



కొండమల్లేపల్లిలో కురుస్తున్న వర్షం

దేవరకొండ, కొండమల్లేపల్లి మండలాల పరిధిలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. ఈ అకాల వర్షంతో కోతకొచ్చిన వరి చేలు నష్టపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏది ఏమైనా 15 రోజుల నుంచి విపరీతమైన ఎండ తాకిడి ఎదుర్కొ ంటున్న ప్రజానీకం ఈ వర్షానికి వాతావరణం చల్లబడి కాస్త ఊరటనిచ్చింది. ఈదురుగాలులు, వర్షాలు కురిస్తే మామిడికాయలు, వరిచేలకు నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దేవరకొండ, కొండమల్లేపల్లి మార్చి 22 (ఆంధ్రజ్యోతి)

ఫ్లైఓవర్ వంతెనలను నిర్మించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



పాదయాత్రను ప్రారంభిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై ఫ్లైఓవర్ వంతెనలను నిర్మించి ప్రమాదాలు నివారించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం సీపీఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టాలని రామచంద్రగూడెం వైజంక్షన్ నుం చి బైపాస్ మీదుగా నందిపాడు క్రాస్‌రోడ్, టాకా రోడ్డు, రాజీవ్‌చౌక్ మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం డివిజనల్ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణం విస్తరించి బైపాస్‌కు ఆవతలివైపు జననివాసాలు పెరిగాయని అన్నారు. నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు విద్య, వ్యాపా రం, అనేక రకాల పనులపై బైపాస్‌పై క్రాస్‌రోడ్ల వద్ద అటు ఇటు రాకపోకలు చేస్తుంటారని తెలిపారు. వేగంగా ప్రయాణించే వాహనాలతో తరచూ ప్రమాదాలు జరుగుతూ ప్రాణనష్టం సంభవిస్తోందని అన్నారు. బైపాస్‌పై వైజంక్షన్, నందిపాడు, చింతపల్లి, ఈదులగూడ క్రాసి ంగ్‌ల వద్ద ఫ్లైఓవర్ వంతెనలను నిర్మించాలని కోరారు. బైపాస్‌పై నాలుగు అండర్‌పాస్‌ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. సంబంధిత మంత్రి గత 6 నెలల క్రితం భూమిపూజ చేశారని తెలిపారు. నేటివరకు అండర్‌పాస్‌ల నిర్మాణపను లు ప్రారంభానికి నోచుకోలేదని అన్నారు. లేని పక్షంలో ఫ్లైఓవర్‌ల నిర్మాణం కోసం రిలేనిరాహార దీక్షలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీశ్ చంద్ర, సత్యనారాయణరావు, గాదె పద్మ, రవినాయక్, మల్లుగౌతంరెడ్డి, మంగారెడ్డి, శశిధర్‌రెడ్డి, వినోద్ నాయక్, రెమిడాల పరశురాములు, వరలక్ష్మి, చౌగాని సీతారాములు, అయూబ్, అంజద్, అరుణ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి



నేరేడుగొమ్ములో వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

దామరచర్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సీపీఎం మండల కార్యదర్శి మాలోతు వినోద్ నాయక్ అన్నారు. సీపీఎం పోరుబాటలో భాగంగా శనివారం మండల కేంద్రంలో ప్రజలను సమస్య లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక గ్రామాల్లో ఇప్పటికే తాగునీటి సమస్య మొదలైందని అధికారులు స్పందించి బోర్లు, చేతి పంపులను వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. లేనట్లయితే సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపడ్తామన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దయా నంద్, పాషానాయక్, కోటిరెడ్డి, ఎర్రనాయక్, ఖాజామోహిద్దిన్ పాల్గొన్నారు.

మిర్చికి కనీస మద్దతు ధర ఇవ్వాలి

పెద్దవూర : మిర్చి రైతులకు మద్దతు ధర అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, క్వింటాకు రూ.25వేల కనీస మద్దతు ధర అందించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.లక్ష్మీనారాయణ అన్నారు. సీపీఎం పోరుబాటలో భాగంగా శని వారం మండలంలోని కొత్తగూడెం గ్రామంలో మిర్చి రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య, ఎస్‌కె.బషీర్, చిరు, నాగార్జున, దోరెపల్లి మల్లయ్య, తరి రామకృష్ణ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుగొమ్ముకు రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి

దేవరకొండ : మండలంలోని పేర్వాల నుంచి నేరేడుగొమ్ము మండల కేంద్రం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం పంచాయతీరాజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నాగరాజు మా ట్లాడుతూ సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 2 నుంచి స్థానిక సంస్థల పరిష్కారం కోసం సర్వేలు, ర్యాలీలు, ధర్నాలు, వినతి పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు.పేర్వాలలో నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు బిజిలి లింగయ్య, బుడిగ వెంకటేష్, కాశయ్య, లక్ష్మమ్మ, రమేష్, శ్రీరాములు, దశరథ పాల్గొన్నారు.